


ప్రభాత సూర్య
PRABHATA SURYA
తెలుగు దిన పత్రిక
www.suryaa.news

హైదరాబాద్
29-5-2026
వెల: రూ.5/-
పేజీలు: 8
సంపుటి: 09
సంచిక: 260

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

# ఎన్టీఆర్.. ఓ స్ఫూర్తి

- అమెరికా అధ్యక్షుడికి వార్నింగ్ ఇచ్చిన ఇందిర.. ఎన్టీఆర్‌కు కులం, ప్రాంతం, భాష లేదు
- ఆయన విగ్రహంపై ఎవరేమన్నా భయపడను.. కేసీఆర్‌కు రాజకీయ భిక్ష పెట్టిందే ఎన్టీఆర్
- ఆయన నీడన బతికి తక్కువ చేసి మాట్లాడొచ్చా?.. ఆయన పేరుతో నకిలీ నేత ఉన్నారు
- మహిళా రిజర్వేషన్లు రాజీవ్, ఎన్టీఆర్‌ల చలువే.. బాబు ప్రణాళికతోనే ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్
- ఫ్యూచర్ సిటీకి దిగ్గజ కంపెనీలను తెస్తాం.. ఎన్టీఆర్ విగ్రహావిష్కరణలో సీఎం రేవంత్‌రెడ్డి
- ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఎన్టీఆర్ ఘాట్ వద్ద కుటుంబ సభ్యులు, నేతల నివాళులు



రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో ఇందిరమ్మ స్ఫూర్తి, ఎన్టీఆర్ ఆలోచనా విధానం కనిపిస్తాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజాసంక్షేమం విషయంలో స్ఫూర్తి పొందడంలో తమకు ఇందిరమ్మ ఎంత ముఖ్యమో, ఎన్టీఆర్ కూడా అంతే ముఖ్యమని చెప్పారు. ఇందిరమ్మ ఒక తరం అయితే ఎన్‌టీఆర్ ఒక శకమని, వారిద్దరి మేలు కలయికే ఈ నాటి కాంగ్రెస్ ప్రజాపాలన అని వ్యాఖ్యానించారు. నిరుపేదల అభ్యున్నతిని వారి ఆదర్శంతోనే కొనసాగిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. గురువారం రేవంత్ అమీర్‌పేట మైత్రి వనం చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆయన జయంతి సందర్భంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, దేశ చరిత్రలో ముగ్గురు జాతి రత్నాలను స్మరించుకోవాలని చెప్పారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్, ఉక్కుమహిళ ఇందిరాగాంధీల తర్వాత మూడో వ్యక్తి తెలుగు జాతి గర్వించదగ్గ నేత ఎన్‌టీఆర్ అన్నారు. దళితులు, గిరిజనులు, ఆదివాసీలకు సమాన హక్కులు కల్పించింది అంబేద్కర్ అయితే, భూస్వాముల

## దేశానికి ఆదర్శంగా ఫ్యూచర్ సిటీ

- నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రులు
- భవిష్యత్ అవసరాల దృష్ట్యా నగర నిర్మాణం
- మంత్రులు పొంగులేటి, శ్రీధర్ బాబుల వెల్లడి



హైదరాబాద్,మే28(ఆర్ఎన్ఎ): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అభివృద్ధి చేస్తున్న ఫ్యూచర్ సిటీ దేశానికే ఆదర్శంగా నిలిచే విధంగా రూపుదిద్దుకుంటోందని రాష్ట్ర మంత్రులు



## ఏపీ మద్యం కుంభకోణం కేసు...

- ఏడున్నర గంటల పాటు విజయసాయిరెడ్డి విచారణ
- బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయంలో విచారించిన అధికారులు
- మద్యం పాలసీ కేసుతో తనకు సంబంధం లేదన్న విజయసాయిరెడ్డి
- రాజ్ కెసిరెడ్డి పేరు తప్ప తాను ఎవరి పేరు చెప్పలేదని వెల్లడి

# 'హైబ్రిడ్' మహానాడు సూపర్‌హిట్!

- ఎన్టీఆర్‌కు భారతరత్న పురస్కారం ఇవ్వాలి
- యువతను రాజకీయాల్లో ప్రోత్సహించిన మహోన్నతుడు
- మహానాడు తీర్మానంలో చంద్రబాబు డిమాండ్



మాజీ సీఎం, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు తెలుగుజాతి సెంటిమెంట్ అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని కేంద్రప్రభుత్వాన్ని అడుగుతానని పేర్కొన్నారు. గురువారం రెండోరోజు మంగళగిరిలో జరుగుతున్న మహానాడు వేడుకలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, టీడీపీ సీనియర్ నేతలు, మంత్రులు నివాళు లు అర్పించారు.

అమరావతి,మే: 1,875 క్లస్టర్ల నుంచి మహానాడుకు టీడీపీ నేతలు, శ్రేణులు భారీగా హాజరయ్యారు. ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని మహానాడులో ఆయనకు నివాళి అర్పించే తీర్మానంపై సీఎం ప్రసంగించారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని మహానాడులో ప్రతిపాదించారు. దేశ అత్యున్నత పౌర పురస్కారంతో ఎన్టీఆర్‌ను సత్కరించాలని సీఎం చంద్రబాబు కోరారు. ని చెప్పుకొచ్చారు. ఎన్టీఆర్ పాలన రైతులకు అండ, మహిళలకు భరోసా, కార్మికులకు అభయం.. యువతకు దిక్సూచి అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. 1983లో రాజకీయాల్లో యువతకు ఎన్టీఆర్ అవకాశాలు కల్పించారని ప్రస్తావించారు. మహిళలకు ఆస్తి హక్కు కల్పించారని.. భవిష్యత్తులో సమర్థ నాయకత్వం ఉండేలా భవిష్యత్తు కార్యాచరణ చేపడుతున్నామని అన్నారు. నిన్నటి మహానాడులో

## హైదరాబాద్‌లో యాపిల్ ఎక్స్‌పీరియెన్స్ సెంటర్

- టీ--హబ్ వద్ద 40 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు
- దసరా నాటికి వినియోగదారులకు అందుబాటులోకి
- సర్వీస్, కాల్ సెంటర్‌తోపాటు బ్యాకెండ్ సపోర్ట్ కూడా..
- గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌గా తీర్చిదిద్దనున్న కంపెనీ
- మొత్తం 3 లక్షల చదరపు అడుగుల్లో భవనం

హైదరాబాద్: అమెరికా టెక్ దిగ్గజం యాపిల్.. హైదరాబాద్‌లో దసరా నాటికి ఎక్స్‌పీరియెన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేయనుంది. రాయదుర్గంలోని టీ--హబ్ సమీపంలో 40,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో






## ఎట్టకేలకు సిద్ధరామయ్య రాజీనామా


- గవర్నర్ కార్యదర్శికి రాజీనామా లేఖ అందచేత
- అధిష్టానం ఆదేశాల మేరకు వైదొలుగుతున్నట్లు ప్రకటన
- జాతీయ రాజకీయాలకు వెళ్లే ఆలోచన లేదని వెల్లడి

## పశ్చిమాసియాలో మళ్లీ సెగలు



- ఇరాన్‌పై మరోసారి దాడికి దిగిన అమెరికా
- బందర్ అబ్బాస్‌లో సైనిక స్థావరంపై క్షిపణులు
- నాలుగు ఇరాన్ అటాక్ డ్రోన్లు కూల్చివేత
- కువైట్‌లో అమెరికా స్థావరంపై ఇరాన్ ప్రతీకార దాడి

వాషింగ్టన్/దుబాయ్: అమెరికా, ఇరాన్ మధ్య మళ్లీ ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. ఒకవైపు శాంతి చర్చలు కొనసాగుతుండగానే.. మరోవైపు ఇరుదేశాల మధ్య దాడులు, ప్రతిదాడులు చోటుచేసుకుంటున్నాయి. ఇరాన్ సైనిక స్థావరంపై



## మహానాడు కాదు.. దగానాడు, మాయానాడు, బూతునాడు

- టీడీపీని చెప్పల పార్టీ, వెన్నుపోటు పార్టీ, దొంగల పార్టీ
- తల్లి, చెల్లి, గొడ్డలి అంటూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు
- తెలుగుదేశంపై మాజీమంత్రి రోజా ఘాటు విమర్శలు

# పశ్చిమాసియాలో మళ్లీ సెగలు

బుధవారం రక్షణాత్మక దాడికి దిగినట్లు అమెరికా సైన్యం ప్రకటించింది. అంతకుముందు ఇరాన్ అటాక్ డ్రోన్లను కూల్చివేశామని పేర్కొంది. హార్మూజ్ జలసంధి పరిసరాల్లో ముప్పుగా పరిణమించిన నాలుగు ఇరాన్ వన్--వే దాడి డ్రోన్లను అమెరికా సెంట్రల్ కమాండ్ దళాలు కూల్చివేసినట్లు వెల్లడించింది. బందర్ అబ్బాస్‌లోని ఇరాన్ గ్రౌండ్ కంట్రోల్ స్టేషన్‌పై అమెరికా దళాలు క్షిపణులు వర్షం కురిపించాయి. ఐదో డ్రోన్‌ను ప్రయోగించడానికి ఇరాన్ జవాన్లు సిద్ధమవుతున్న సమయంలోనే ఈ దాడి జరిగింది.

**ఒప్పందం దగ్గర్లోనే ఉంది**

ఇరాన్ సైనిక శక్తి చాలావరకు క్షీణించిందని, అందుకే తమతో చర్చలకు ముందుకొచ్చిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. బుధవారం కేబినెట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇరాన్‌తో శాంతి ఒప్పందానికి తొందరేమీ లేదని చెప్పారు. ఈ ఏడాది నవంబర్‌లో అమెరికాలో మధ్యంతర ఎన్నికలు ఉన్నప్పటికీ ఇరాన్‌తో ఒప్పందం విషయంలో తాము తొందరపడడం లేదన్నారు. అయితే, అమెరికా--ఇరాన్ శాంతి ఒప్పందం దగ్గర్లోనే ఉందని వ్యాఖ్యానించారు.

**అలాగైతే ఒమన్‌ను పేల్చేస్తాం: ట్రంప్**

హార్మూజ్ జలసంధిని నియంత్రించడానికి ఒమన్ సహా ఏ ఒక్క దేశాన్ని కూడా అనుమతించబోమని డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. పశ్చిమాసియాలో యుద్ధాన్ని ముగించే కొత్త ఒప్పందంలో భాగంగా.. ఇరాన్, ఒమన్ కలిసి హార్మూజ్ గుండా జరిగే రవాణాను నియంత్రిస్తాయంటూ వచ్చిన వార్తలను ఆయన తోసిపుచ్చారు. ఆ జలసంధిని ఎవరూ కంట్రోల్ చేయలేరని అన్నారు. అవి అంతర్జాతీయ జలాలు అని గుర్తుచేశారు. ఒమన్ కూడా అందరిలాగే ప్రవర్తించాలని వ్యాఖ్యానించారు. లేకపోతే మనం ఒమన్‌ను కూడా పేల్చివేయాల్సి వస్తుందని తేల్చిచెప్పారు.

**కువైట్‌లో అమెరికా స్థావరంపై ఇరాన్ దాడి**

అమెరికాపై ఇరాన్ సైన్యం ప్రతీకార దాడులకు దిగింది. కువైట్‌లోని అమెరికా సైనిక స్థావరంపై బుధవారం రాత్రి క్షిపణులు, డ్రోన్లు ప్రయోగించింది. అయితే, వీటిని కువైట్ గగనతల రక్షణ వ్యవస్థలు మధ్యలోనే కూల్చివేసినట్లు అమెరికా సైనిక వర్గాలు గురువారం స్పష్టంచేశాయి. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇరాన్ ఉల్లంఘిస్తోందని ఆరోపించాయి. తమ భూభాగంపై దాడి జరిగిందని కువైట్ ప్రకటించింది. అయితే, తమపై తొలుత దాడిచేసినందుకు ప్రతీకారంపై ఓ గల్ఫ్ దేశంలో అమెరికా స్థావరాన్ని లక్ష్యంగా చేసుకున్నట్లు ఇరాన్ తేల్చిచెప్పింది. ఒమన్‌కు ట్రంప్ హెచ్చరికలు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఎందుకంటే ఒమన్, అమెరికా మిత్రదేశాలు. అమెరికా సైనిక కార్యక్రమాలకు ఒమన్ సహకరిస్తోంది. అమెరికా, ఇరాన్‌ల మధ్య నిశ్శబ్ద మధ్యవర్తిగా వ్యవహరిస్తూ వచ్చింది.

# ఎన్టీఆర్.. ఓ స్ఫూర్తి

వద్ద లక్షల ఎకరాల భూమిని తీసుకొని నిరుపేదలకు భూములిచ్చి గౌరవాన్ని కల్పించింది ఇందిర అన్నారు. యుద్ధంలో భారత ప్రధానమంత్రుల లొంగుబాటును చూస్తున్నామని, 1971లో ఇందిర పాకిస్థాన్ మీద యుద్ధం గెలిచి బంగ్లాదేశ్‌ను విముక్తం చేశారని చెప్పారు. భారత రాజకీయాలలో వేలు పెట్టొద్దని అమెరికా అధ్యక్షుడినే హెచ్చరించిన ఉక్కు మహిళగా అభివర్ణించారు. నీతి, నిజాయితీ, నిబద్ధత, ఉక్కు సంకల్పం ఉన్న నాయకుడు దేశంలో ఎవరైనా ఉన్నారంటే ఆయన ఎన్టీఆరేనన్నారు. ఆయన తెలుగు జాతి గర్వించదగ్గ బిడ్డ అని వ్యాఖ్యానించారు. మానవ మనుగడ ఉన్నంత కాలం ఆ ముగ్గురి కీర్తి ప్రతిష్ఠలు ఉంటాయని చెప్పారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహాన్ని అమీర్‌పేట మైత్రివనం వద్ద ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, నందమూరి కుటుంబ సభ్యులు, నటుడు మంచు మనోజ్, దర్శకుడు బోయపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు రాజకీయ భిక్ష పెట్టిందే ఎన్టీఆర్ అన్నారు. అన్న ఎన్టీఆర్ లేకుంటే మీరు నాయకుడు అయ్యారా అని నిలదీశారు. అన్న నీడన బతికిన మీరు ఆయన గురించి తక్కువ చేసి మాట్లాడటమేమిటని ప్రశ్నించారు. రామారావు పేరు పెట్టుకున్న నకిలీలు కూడా కూడా ఈరోజు నాయకుడిగా చెలామణి అవుతున్నారని వ్యాఖ్యానించారు. ఎన్టీఆర్ అవకాశమిచ్చి, ప్రోత్సాహమిచ్చిన వారిలో తుమ్మల నాగేశ్వరరావు, మండవ వెంకటేశ్వరరావు, మాధవరెడ్డి, జానారెడ్డి, దేవేందర్ గౌడ్, కడియం శ్రీహరి, మోత్కుపల్లి నర్సింహులుతో పాటు కేసీఆర్ కూడా ఉన్నారని పేర్కొన్నారు. ఆయనకు రాజకీయ అవకాశం కల్పించిందే ఎన్టీఆర్ అన్నారు. ఈ చరిత్రను ఎవరూ మరువరాదని రేవంత్ రెడ్డి అన్నారు.

# హైదరాబాద్‌లో యాపిల్ ఎక్స్‌పీరియెన్స్ సెంటర్

ఇది కొలువుదీరనుంది. ఎక్స్‌పీరియెన్స్ సెంటర్‌తోపాటు సర్వీస్, కాల్ సెంటర్ సైతం ఏర్పాటు చేయనుంది. బ్యాకెండ్ సపోర్ట్ టీమ్ కూడా ఇక్కడి నుంచే కార్యకలాపాలు నిర్వహించనుంది. వాటన్నింటి కోసం కంపెనీ మొత్తంగా సుమారు 3 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం లీజుకు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ కేంద్రాన్ని గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌గా (జీసీసీ) యాపిల్ తీర్చిదిద్దనుందని సమాచారం. దాదాపు 1,400 మంది సిబ్బంది వరకు ఇక్కడ కూర్చునే వీలుంది. డేటా ప్రొటెక్షన్, మెడికల్, కమ్యూనికేషన్, ఏఐ, నేవిగేషన్ సిస్టమ్, ట్రాఫిక్ సర్వేలెన్స్, వాయిస్ రికగ్నిషన్ తదితర విభాగాలకు చెందిన సాంకేతిక నిపుణులు విధులు నిర్వర్తిస్తారు. డిజిటల్ ఆపరేషన్స్ కూడా ఇక్కడి నుంచే జరిపే అవకాశం ఉంది. ఇప్పటికే గచ్చిబౌలిలోని వేవ్‌రాక్‌లో యాపిల్‌కు జీసీసీ ఉంది. హైదరాబాద్‌లోని రెండు జీసీసీల కోసం కొత్తగా 3,500 మందిని యాపిల్ నియమించుకుందని తెలుస్తోంది.

# ఏపీ మద్యం కుంభకోణం కేసు...

ఏపీ మద్యం కుంభకోణం కేసులో రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డిని ఈడీ సుమారు ఏడున్నర గంటల పాటు విచారించింది. బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయంలో అధికారులు ఆయనను విచారించారు. విచారణ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, మద్యం పాలసీ కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదని అన్నారు. తాను ఎవరి పేర్లను అధికారులకు చెప్పలేదని వెల్లడించారు. మద్యం కుంభకోణానికి సంబంధించిన విషయాలన్నీ రాజ్ కెసిరెడ్డికి మాత్రమే తెలుసని చెప్పానని వెల్లడించారు. కేసు దర్యాప్తులో భాగంగా గతంలో సీజ్ చేసిన మొబైల్ ఫోన్‌లలోని వివరాలను ఈడీ అధికారులు సేకరించారని తెలిపారు. లోపల ప్రశ్నలు, విచారణలు పెద్దగా ఏమీ జరగలేదని పేర్కొన్నారు. తన ఫోన్‌లోని డేటా ట్రాన్స్ ఫర్ కోసం పిలిచినట్లు చెప్పారు. వారికి అవసరమైన సమాచారం తన ఫోన్‌లో ఉంటుందనే ఉద్దేశంతో ఆ డేటాను తీసుకున్నట్లు చెప్పారు. మద్యం పాలసీ కుంభకోణం ఎలా జరిగింది, ఏం జరిగిందనే విషయాలు తెలిసిన వ్యక్తి రాజ్ కెసిరెడ్డి మాత్రమే అన్నారు. ఇప్పటి వరకు తాను ఆయన ఒక్కరి పేరు తప్ప ఎవరి పేరునూ చెప్పలేదని అన్నారు. సిట్ అధికారులకైనా, ఈడీ అధికారులకైనా తాను ఇదే విషయం చెప్పానని అన్నారు. తనను ఎవరు లక్ష్యంగా చేసుకున్నా భయపడే వ్యక్తిని కాదని వ్యాఖ్యానించారు. తిరుమల వెంకన్న సాక్షిగా తాను ఎలాంటి తప్పు చేయలేదని విజయసాయిరెడ్డి అన్నారు.

# దేశానికి ఆదర్శంగా ఫ్యూచర్ సిటీ

పొంగులేటి శ్రీనివాస రెడ్డి, శ్రీధర్ బాబు పేర్కొన్నారు. గురువారం ఫ్యూచర్ సిటీలో నిర్మాణంలో ఉన్న ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) కార్యాలయ భవనం, స్కిల్ యూనివర్సిటీ నిర్మాణ పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఫ్యూచర్ సిటీని అత్యాధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తోందన్నారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పనకు కేంద్రంగా స్కిల్ యూనివర్సిటీ నిలవబోతోందని చెప్పారు. ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయం ద్వారా నగర అభివృద్ధి పనులకు మరింత వేగం చేకూరుతుందని పేర్కొన్నారు. నిర్మాణ పనులను నాణ్యతతో, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఫ్యూచర్ సిటీ అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించిందని మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. స్కిల్ యూనివర్సిటీ శాశ్వత క్యాంపస్ పనులను తనిఖీ చేశారు. క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని సమీక్షించారు. నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని అధికారులకు మంత్రులు ఆదేశాలు జారీ చేశారు. ఎఫ్‌సీడీఏ కార్యాలయం, స్కిల్ యూనివర్సిటీ పనులపై మార్గనిర్దేశర చేశారు. నిర్దేశిత గడువులో పనులు పూర్తి చేయాలని సూచించారు. ఆధునిక మౌలిక వసతులతో ఫ్యూచర్ సిటీ రూపుదిద్దుకుంటోందని తెలిపారు. ఫ్యూచర్ సిటీ దేశానికి తలమానికంగా నిలవడం ఖాయమని మంత్రులు స్పష్టం చేశారు.

# 'హైబ్రిడ్' మహానాడుసూపర్‌హిట్!

జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు లోకేశ్ ప్రతిపాదించిన 33 శాతం రిజర్వేషన్‌ను మనమే ప్రారంభిద్దామని తెలిపారు. 33 శాతం రిజర్వేషన్లను మహిళలకు కల్పించాలని కేంద్రాన్ని మరోమారు కోరదామని అన్నారు. తెలుగు వెలుగుగా నిలిచిన స్వర్గీయ ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలనేది మన అందరి డిమాండ్ అని చెప్పారు. తెలుగుజాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహానేత, విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు ఎన్టీఆర్ అని వ్యాఖ్యానించారు. తెలుగు ప్రజల గుండెల్లో ఎన్టీఆర్ శాశ్వతంగా నిలిచిపోయారని ఉద్ఘాటించారు. సామాన్యుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ నిర్ణయాలు తీసుకున్నారని చెప్పారు. ప్రజల మనస్సుల్లో చిరస్మరణీయ స్థానం సంపాదించారన్నారు. తెలుగు ప్రజల ఐక్యత కోసం పనిచేసిన మహోన్నత నేత ఎన్టీఆర్ అని ఉద్ఘాటించారు. భారత రాజకీయ చరిత్రలో ఆయన సేవలు విశిష్టం, అపూర్వమని చెప్పుకొచ్చారు. తెలుగు ప్రజల మనోభావాలను గుర్తించి ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించాలని మహానాడు ఏకగ్రీవంగా తీర్మానిస్తోందని తెలిపారు. ఇది మనందరి ఆకాంక్ష, ప్రతీ తెలుగువారి కోరిక అని చెప్పారు. దేశరాజకీయాల్లో పెనుమార్పులకు నాంది పలికిన మహోన్నత నాయకుడికి భారతరత్న ఇవ్వాలని కేంద్రప్రభుత్వాన్ని సీఎం చంద్రబాబు కోరారు. ఎన్టీఆర్ అంటే అన్నివర్గాలు ప్రేమించే నాయకుడని ప్రశంసించారు. సాధారణ ఉద్యోగిగా మొదలై, సినిమా స్టార్‌గా ఎదిగి, ప్రజల కోసం పార్టీ పెట్టి సీఎంగా ఎదగడం ఎన్టీఆర్‌కే సాధ్యమని కీర్తించారు. ఆత్మగౌరవాన్ని, ఆత్మాభిమానాన్ని ఎన్టీఆర్ ఎప్పుడూ వీడలేదని తెలిపారు. 'సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్లు' అనేదే ఎన్టీఆర్ సిద్ధాంతమని పేర్కొన్నారు. తెలుగు జాతి ఉన్నంత వరకూ తెలుగువారి గుండెల్లో ఎన్టీఆర్ శాశ్వతంగా నిలిచిపోతారని సీఎం చంద్రబాబు ఉద్ఘాటించారు. ఎన్టీఆర్ జయంతి తెలుగువారందరికీ పండుగ రోజు అని తెలిపారు. సాధారణ ఉద్యోగిగా జీవితాన్ని ప్రారంభించి సినీ జీవితంతో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ ఎదిగారని ప్రశంసించారు. ఎన్టీఆర్ మళ్లీ పుడితే తప్ప ఆయన క్రమశిక్షణ, ఆయన ఖ్యాతి మరెవరికీ సాధ్యం కాదని అన్నారు. ఆయన ఎక్కడ ఉన్నా తెలుగువారి ఆత్మగౌరవం కోసమే జీవించారని తెలిపారు. రైతుబిడ్డ నుంచి సినిమాల్లో శ్రీరామ, శ్రీకృష్ణ పాత్రల వరకూ, టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రిగా ఆయన చరిత్ర సృష్టించారని ఉద్ఘాటించారు.

### ఎట్టకేలకు సిద్ధరామయ్య

# రాజీనామా

బెంగళూరు: కర్నాటకానికి తెరపడింది. గతకొంతకాలంగా ఊహాగానాలతో సాగిన రాజకీయాలు మలుపు తిరిగాయి. కర్నాటకలో సిద్ధరామయ్య జమానా ముగిసింది. ఎట్టకేలకు కర్ణాటకలో నాయకత్వ మార్పు చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి పదవికి సిద్ధరామయ్య రాజీనామా చేశారు. గురువారం మధ్యాహ్నం డీకే శివకుమార్‌తో కలిసి ఆయన లోక్‌భవన్‌కు వెళ్లారు. అయితే, ఆ సమయంలో గవర్నర్ థావర్ చంద్ గహ్లోత్ అందుబాటులో లేకపోవడంతో ఆయన కార్యదర్శికి సిద్ధరామయ్య తన రాజీనామా లేఖను సమర్పించారు. ఈ విషయాన్ని గవర్నర్ ప్రత్యేక కార్యదర్శి సైతం ధ్రువీకరించారు. సీఎం రాజీనామా లేఖను తీసుకున్నామని, గవర్నర్ తిరిగొచ్చాక దీనిపై నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు. గహ్లోత్ ఈ సాయంత్రం బెంగళూరు చేరుకోనున్నారు. అనంతరం మంత్రులు డీకే శివకుమార్, పరమేశ్వరతో కలిసి సిద్ధరామయ్య మీడియాతో మాట్లాడారు. అధిష్ఠానం సూచనలతో సీఎం పదవికి రాజీనామా చేశా. హైకమాండ్ ఆదేశాలకు అందరం కట్టుబడి ఉంటాం. రాష్ట్ర ప్రయోజనాల కోసమే వైదొలిగా. నిబంధనల ప్రకారం ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశా. దాన్ని గవర్నర్ ఆమోదిస్తారనే విశ్వాసం ఉంది. అసెంబ్లీలో కాంగ్రెస్‌కు సంపూర్ణ మెజార్టీ ఉంది. రాజ్యాంగబద్ధంగా కొత్త ప్రభుత్వం ఏర్పడుతుంది. ఇప్పటివరకు ప్రభుత్వ నిర్వహణలో నాకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు. సీఎంగా నాకు అవకాశమిచ్చిన సోనియా, రాహుల్, ఖర్గేకు కృతజ్ఞతలు. 7 కోట్ల మంది కర్ణాటక ప్రజలకు సేవ చేసే అవకాశం లభించింది. రాజ్యాంగమే మా ధర్మం. ప్రజలే మాకు దేవుళ్లు అని సిద్ధరామయ్య తెలిపారు. జాతీయ రాజకీయాల్లోకి రావాలని హైకమాండ్ అడిగింది. రాజ్యసభ సీటు ఆఫర్ చేసింది. కానీ, నేను సున్నితంగా తిరస్కరించా. జాతీయ స్థాయి రాజకీయాలపై నాకు ఆసక్తి లేదు. అయితే, రాజకీయాల నుంచి వైదొలిగే ప్రసక్తే లేదు. ప్రజలు నన్ను 5 ఏళ్ల కాలానికి ఎన్నుకున్నారు. ఇంకా రెండేళ్లు మిగిలి ఉన్నాయి. అప్పటివరకు ఎమ్మెల్యేగానే కొనసాగుతానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తన రాజకీయ ప్రస్థానాన్ని, పదవీకాలాన్ని గుర్తుచేసుకుంటూ సిద్ధరామయ్య ఒకింత భావోద్వేగానికి గురయ్యారు. నేను పొరపాటున రాజకీయాల్లోకి వచ్చా. మా కుటుంబంలో అంతకుముందు ఎవరూ రాజకీయాల్లో లేరు. 2006లో కాంగ్రెస్‌లో చేరినప్పటి నుంచి హైకమాండ్ నన్ను ఆదరించింది. సీఎం అవుతానని కలలో కూడా అనుకోలేదు. అలాంటిది ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నేతగా రెండేసిసార్లు సేవలందించాను. మ్యానిఫెస్టోలో ఇచ్చిన 160 హామీల్లో 158 నెరవేర్చా. మొదటి ఏడాదిలోనే ఐదు గ్యారెంటీలు అమలు చేశాం. నాపై ప్రతిపక్షాలు వదంతులు ప్రచారం చేశాయి. కానీ, నా రాజకీయ జీవితం తెరిచిన పుస్తకం. పదవి కోసం, డబ్బు కోసం ఏనాడూ పాకులాడలేదని సిద్ధరామయ్య వివరించారు. ఈ క్రమంలో అధిష్టానంతో భేటీకి సిద్ధరామయ్య దిల్లీ వెళ్లనున్నట్లు సమాచారం. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో భేటీ కానున్నారు. కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యేల సమావేశానికి సంబంధించి నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. సిద్ధరామయ్య స్థానంలో రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ బాధ్యతలు చేపట్టడం దాదాపు ఖాయంగానే కనిపిస్తోంది. శనివారం జరిగే సీఎల్పీ సమావేశంలో కొత్త శాసనసభాపక్ష నేతను ఎన్నుకునే అవకాశం ఉంది. ప్రమాణస్వీకార కార్యక్రమంపై అధికారిక ప్రకటన ఇంకా వెలువడలేదు.

# మహానాడు కాదు.. దగానాడు, మాయానాడు, బూతునాడు

తిరుపతి తెలుగుదేశం పార్టీ, మహానాడుపై మాజీ మంత్రి, వైసీపీ నేత ఆర్కే రోజా తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు .. తిరుపతిలో మీడియాతో మాట్లాడిన ఆమె.. టీడీపీ, సీఎం చంద్రబాబు నాయుడు, నారా లోకేష్‌లపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.. టీడీపీ నిర్వహిస్తున్న మహానాడును లక్ష్యంగా చేసుకుని ఆమె ఘాటు వ్యాఖ్యలు చేశారు. టీడీపీ ఒక 'బోగస్ పార్టీ' అంటూ వ్యాఖ్యానించిన రోజా, ఆ పార్టీకి కోటి మంది సభ్యులు ఉన్నారని చెప్పుకుంటున్నప్పటికీ మహానాడును చూస్తే రాష్ట్రంలో ఎక్కడా ఉత్సాహం కనిపించడం లేదన్నారు. మహానాడు అట్టర్ ఫ్లాప్ అయ్యింది. అందుకే రికార్డ్ డ్యాన్సులు వేసి పార్టీ క్యాడర్‌ను కూర్చోబెడుతున్నారని అంటూ ఎద్దేవా చేశారు. మహానాడును ఉద్దేశించి 'ఇది మహానాడు కాదు.. దగానాడు, మాయానాడు, భూతునాడు' అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. సూపర్ సిక్స్ హామీల గురించి ప్రశ్నిస్తే సమాధానాలు చెప్పకుండా తల్లి, చెల్లి, గొడ్డలి అంటూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. ఇక, చంద్రబాబు.. హెరిటేజ్ ఆస్తుల్లో తన తల్లి, చెల్లికి ఎంత ఆస్తులు ఇచ్చారో చెప్పగలరా అని రోజా ప్రశ్నించారు. వాళ్లు ఎక్కడ ఉన్నారో కూడా ప్రజలకు తెలియదు. తల్లికి, చెల్లికి సహాయం చేసినట్టు ఒక్క ఫోటో అయినా చూపించగలరా అని విమర్శించారు. ఈ దేశంలో జగన్ తన చెల్లికి ఇచ్చినంత ఆస్తులు మరెవ్వరూ ఇవ్వలేదని రోజా వ్యాఖ్యానించారు. మాజీ మంత్రి వివేకానంద రెడ్డి హత్య కేసుపై కూడా రోజా స్పందించారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడే వివేకా హత్య జరిగిందని గుర్తుచేస్తూ, అప్పట్లో నిందితులను ఎందుకు పట్టుకోలేకపోయారని ప్రశ్నించారు. వివేకా కేసులో నిందితుడైన దస్తగిరికి టీడీపీ మద్దతు ఇస్తోందని ఆరోపించారు. చంద్రబాబు కేసులు వాదించే లాయరే ప్రస్తుతం దస్తగిరికి లాయర్‌గా ఉన్నారని పేర్కొన్నారు. టీడీపీని చెప్పుల పార్టీ, వెన్నుపోటు పార్టీ, దొంగల పార్టీ అంటూ రోజా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఎన్టీఆర్‌పై చెప్పులు వేయించారని, వెన్నుపోటు పొడిచారని, ఆయన పార్టీని దొంగతనంగా లాక్కున్నారని ఆరోపించారు. పెద్ద ఎన్టీఆర్‌కు చంద్రబాబు వెన్నుపోటు పొడిచారు. చిన్న ఎన్టీఆర్‌కు లోకేష్ వెన్నుపోటు పొడవలేదా? అంటూ ప్రశ్నించారు. అలాగే పవన్ కల్యాణ్ తల్లిని తిట్టించింది కూడా లోకేష్ కాదా అని ప్రశ్నించారు. మరోవైపు.. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇస్తామని లోకేష్ చెబుతున్నారని, అయితే అది కేవలం డైవర్షన్ పాలిటిక్స్ మాత్రమేనని రోజా విమర్శించారు. టీడీపీకి నిజంగా దమ్ముంటే మహానాడులో 33 శాతం మహిళా రిజర్వేషన్‌పై తీర్మానం చేయాలి. బీజేపీ మహిళా బిల్లును అమలు చేయకపోతే ప్రభుత్వాన్ని కూలదోస్తామని చెప్పగలరా?' అని ఆమె సవాల్ విసిరారు. జగన్ ఇప్పటికే 2023 అసెంబ్లీలో మహిళా బిల్లుపై తీర్మానం చేశారని, స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని ఎప్పుడో ప్రకటించారని రోజా తెలిపారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి టీడీపీ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని రోజా ఆరోపించారు. పెట్రోల్, డీజిల్ ధరలను చంద్రబాబు అడ్డదిడ్డంగా పెంచుతున్నారని విమర్శించారు. పేదలు ఎక్కువ మంది పిల్లలను కనాలని చెప్పే చంద్రబాబు, తన కుటుంబంలో మాత్రం ఒక్కో పిల్లవాడినే కనారని ఎద్దేవా చేశారు. లోకేష్‌పై కూడా రోజా తీవ్ర వ్యాఖ్యలు చేస్తూ, 'జూమ్ మీటింగ్‌లో కొడాలి నాని, వల్లభనేని వంశీ వస్తే భయపడి పారిపోయిన వ్యక్తి లోకేష్' అని విమర్శించారు. అలాగే జగన్ పీఏ కేఎన్ఆర్‌ను విచారణ పేరుతో వేధిస్తున్నారని ఆరోపిస్తూ, వైసీపీ నేతలపై కక్షసాధింపు చర్యలు కొనసాగుతున్నాయని రోజా మండిపడ్డారు.

# డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నెలాఖరులోగా పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్





**మిర్యాలగూడ మే 28:-( ప్రభాత సూర్య :**మిర్యాలగూడ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పనులు ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు. గురువారం ఆయన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ తో కలిసి మిర్యాలగూడ పట్టణంలోని శ్రీనివాస్ నగర్ గుమస్తాల కాలనీలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పరిశీలించారు. జూన్ 2 నాటికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు సంబంధించిన అన్ని పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్లను అందజేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బిఎల్ఆర్ అధికారులను కోరారు. అనంతరం మిర్యాలగూడ ఆర్‌డీఓ కార్యాలయంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లపై కలెక్టర్, ఎమ్మెల్యేలు సమీక్ష నిర్వహించారు. జూన్ 2న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నందున సీసీ రోడ్లు, వాటర్ ట్యాంకులు, తాగునీటి ట్యాపులు, విద్యుత్ సౌకర్యాలు, కిటికీలకు గ్లాసులు, బాత్రూములు, ట్రాన్స్‌ఫార్మర్, స్ట్రీట్ లైట్లు తదితర పనులన్నీ పూర్తి చేసి అప్పగించాలని, ఈ నెల 30 లోగా అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పార్కులు, వాటర్ ప్లాంట్లు, గదుల శుభ్రత, సానిటేషన్, మరుగుదొడ్లు, మొక్కల నాటడం, మిషన్ భగీరథ నీటి సరఫరా, ఇంటర్నల్ రోడ్లు, డ్రైనేజీలు, పెయింటింగ్ పనులు పూర్తి చేయాలని చెప్పారు. ప్రతి ఇంటికి నీటి నల్లాలు, ఎలక్ట్రికల్ లైన్లు, పంప్ హౌస్‌లు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అలాగే గుంతల రోడ్లకు మరమ్మతులు మూడు రోజుల్లో పూర్తి చేయాలని, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మంచినీటి లైన్లు పూర్తిచేయాలని, తాగునీటి ట్యాంకులను పూర్తిగా శుభ్రం చేయించాలని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో పాటు కరెంట్, ఫ్యాన్లు, బోర్డుల పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్ ,ఆర్డిఓ ఎస్.రమణారెడ్డి, తహసిల్దార్ శ్రీనివాస్, హౌసింగ్, పంచాయతీ డిఇఇలు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ఆర్ఐ రామకృష్ణ ఉన్నారు.

# వాక్కు స్వాతంత్రం రాజ్యాంగం కల్పించిన హక్కు

**ప్రొఫెసర్ నాగేశ్వర్ పై ఆంధ్ర పోలీసుల దాష్టికాన్ని ఖండిస్తున్నాం**

**పవన్ కళ్యాణ్ బే షరతుగా ప్రొఫెసర్ కు క్షమాపణ చెప్పాలి**

**పెట్టిన కేసులు వెంటనే ఎత్తివేయాలి...లేకుంటే తెలంగాణలో తిరగనివ్వం**

**తెలంగాణ తొలి మలిదశ ఉద్యమకారుడు బత్తుల సోమయ్య**



**ఖమ్మం( ప్రభాత సూర్య ప్రతినిధి ):** ఏ విషయం పైన అయినా మాట్లాడే స్వాతంత్రం భారత రాజ్యాంగం కల్పించిందని ప్రొఫెసర్ నాగేశ్వర్ మాట్లాడిన మాటల్లో ఎలాంటి తప్పులు లేవని తెలంగాణ తొలి మలిదశ ఉద్యమకారుడు బత్తుల సోమయ్య అన్నారు. ఒక మేధావిగా ఒక ప్రొఫెసర్ గా ఒక జర్నలిస్టుగా ఒక ఎనాలసిస్ట్ గా ప్రొఫెసర్ నాగేశ్వర్ కు ఉన్న సమాచారం మేరకే పవన్ కళ్యాణ్ విషయంపై మాట్లాడి ఉంటారని అందులో నిజం లేకపోతే మాట్లాడి ఉండరని సోమయ్య అన్నారు. అనేక అంశాలపై అనేక సందర్భాలలో తన అభిప్రాయాన్ని నాగేశ్వర్ వెల్లడించారని ఎన్నడు లేని విధంగా నేడు కావాలని ఆయన మాటలను వక్రీకరించి ఆయనపై సోషల్ మీడియాలో దాడికి దిగుతున్నారని మేధావులను నివారించాలని చూస్తే రానున్న రోజుల్లో తగిన మూల్యం చెల్లించుకోవలసి వస్తుందని అన్నారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ ఏ పార్టీకి చెందిన వ్యక్తి కాదని తన అభిప్రాయాలను ఉన్నది ఉన్నట్టుగా సైంటిఫిక్ గా వెల్లడి పరుస్తారని అలాంటి ఎనలిస్టులపై ఆంధ్ర సోషల్ మీడియా ఆంధ్ర నాయకులు దాడి చేస్తామంటే తెలంగాణ ప్రజానీకం ఊరుకోదని హెచ్చరించారు. నాగేశ్వర పై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేసి భే షరతుగా క్షమాపణ చెప్పాలని సోమయ్య డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించి 12 ఏళ్లు గడిచిన ఇంకా వలసవాద ఆంధ్ర పాలకుల ఆధిపత్యం పోవడం లేదని ఇకనైనా మేధావులు విద్యార్థులు యావత్ తెలంగాణ ప్రజానీకం ఏకం కావాలని ఇలాంటి పెత్తందారులపై గళాన్ని వినిపించాలని సోమయ్య పిలుపునిచ్చారు.



# ప్రధాన రోడ్డుపై విరిగిపడ్డ తుమ్మచెట్టు

**నిలిచిపోయిన వాహనాలు**

**ప్రమాదాన్నిగుర్తించిన గుండ్ల మాచునూర్ సర్పంచ్**

**జెసిబి రప్పించి తుమ్మ చెట్టును రోడ్డు పక్కకు తొలగించారు.**

**ప్రభాత సూర్య నర్సాపూర్ మే 28:** హత్నూర మండల పరిధిలోని దౌల్తాబాద్ సమీపంలో సంగారెడ్డి -నర్సాపూర్ ప్రధాన రహదారిపై తుమ్మ చెట్టు విరిగిపడింది. నిత్యం వాహనాలతో రద్దీ ఉండే ఈ రహదారిపై విరిగిపడ్డ తుమ్మ చెట్టు ప్రమాదకరంగా మారింది. అది గమనించిన గుండ్ల మాచు నూర్ సర్పంచ్ బి.శ్రీహరి వెంటనే జెసిబి వాహనాన్ని రప్పించి రోడ్డుపై పడి ఉన్న తుమ్మ చెట్టును తొలగించారు. దీంతో అక్కడ రాత్రి సమయంలో జరిగే ప్రమాదాన్ని నివారించినట్లయింది. అటుగా వెళ్తున్న వాహనదారులు ఆయనను అభినందించారు.

# ఎన్టీఆర్ కు నివాళి అర్పించిన వారధి ఫౌండేషన్ చైర్మన్ చింతనిప్పు కృష్ణ చైతన్య

**ఎన్టీఆర్ కి భారత రత్న ప్రకటించాలి అని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి**

**తెలంగాణ గడ్డ కి నిజమైన ప్రజాస్వామ్య పరిమళాలు అద్దింది ఎన్టీఆర్ పాలనే**

**ఖమ్మం( ప్రభాత సూర్య ప్రతినిధి):** ఉమ్మడి రాష్ట్ర పూర్వ ముఖ్యమంత్రి తెలుగువారి ఆత్మగౌరవాన్ని దశ దిశలా చాటి చెప్పిన దివంగత నందమూరి తారక రామారావు జయంతి పురస్కరించుకొని గురువారం వారధి ఫౌండేషన్ చైర్మన్ చింతనిప్పు కృష్ణ చైతన్య ఘనంగా నివాళులర్పించారు. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ లోని నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా చింత నిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ తెలుగుజాతి గౌరవాన్ని దేశ విదేశాలలో ఇనుమడింపజేసి తెలుగు భాషకు కీర్తి ప్రతిష్టలు తీసుకుని వచ్చిన అన్న ఎన్టీఆర్ జీవితం ప్రతి ఒక్కరికి మార్గదర్శకం అని తెలిపారు. ఎన్టీఆర్ చూపిన మార్గంలో తెలుగువారి ప్రతిష్ట పెరిగేలా కృషి చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మోతారపు శ్రావణి సుధాకర్ ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.



# మాజీ సిఎం విజయన్ ఇంటిపై ఇడి దాడిని ఖండించిన సిపిఎం నాయకులు

**మిర్యాలగూడ మే 28:-( ప్రభాత సూర్య :** కేరళం మాజీ సిఎం, సిపిఎం పోలిట్ బ్యూరో సభ్యుడు పినరయి విజయన్ ఇంటిపై ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ చేపట్టిన దాడులను సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డి.మల్లేష్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు సిఐటియు నాయకులు మల్లు గౌతంరెడ్డి ఖండించారు. గురువారం స్థానిక సిపిఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కేరళలో బిజెపి కాంగ్రెస్ అపవిత్ర పొత్తు బయటపడిందని ఇద్దరు కలిసి మాజీ సీఎం పిన్నరై విజయన్ కుటుంబాన్ని టార్గెట్ చేయటం సరికాదన్నారు. కేరళలో కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కేంద్రంలోని బిజెపితో కుమ్ముక్కై అర్థం పర్థం లేని పాత కేసులో మనీ ల్యాండరింగ్ అంటూ ఈడి విజయన్ ఇంటిపై దాడి చేయించారని ఇది రాజ్యాంగ విరుద్ధమన్నారు. నిబద్ధతకు నిదర్శనంగా ఉన్న విజయన్ తన పదవి కాలం ముగిసిన వెంటనే అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారని అలాంటి వ్యక్తిపై కేసులు నమోదు చేయటం దారుణమన్నారు. ఇలాంటి దాడులకు సిపిఎం నాయకులు ఎవరు కూడా భయపడరని ధైర్యంగా ఎదుర్కొంటారన్నారు. సమావేశంలో సిపిఎం నాయకులు సైదులు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.






# ఎన్టీఆర్103వ జయంతి సందర్భంగా నివాళులర్పించిన ప్రముఖులు

**మిర్యాలగూడ, మే 28:-( ప్రభాత సూర్య):** విశ్వవిఖ్యాత నటసార్వభౌమ కళా ప్రపూర్ణ, నటరత్న, పద్మశ్రీ నందమూరి తారక రామారావు గారి 103వ జయంతి ని పురస్కరించుకొని మిర్యాలగూడ బస్ స్టాండ్ వద్ద గల ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ సిడి రవికుమార్ తెలుగుదేశం నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. తెలంగాణ తెలుగుదేశం పార్టీ మాజీ రాష్ట్ర కార్యదర్శి కాసుల సత్యం మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల కోసం తన వెండితెర సువర్ణ సింహాసనాన్ని త్యజించి తెలుగుదేశం పార్టీని ఏర్పాటుచేసిన 9 నెలల్లో రాజ్యాధికారాన్ని చేజిక్కించుకున్న గొప్ప రాజకీయ దురంధరుడు గా ఎన్టీఆర్ ను కీర్తించారు. నేడు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో అమలవుతున్న సంక్షేమ పథకాలకు ఆజ్యుడు ఎన్టీ రామారావు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్టిసి రాష్ట్ర కార్యదర్శి ముక్కెర అంజిబాబు, షేక్ సయ్యద్, వెంకన్న, ఆవుల సైదులు పాల్గొన్నారు.

# తెల్లగొర్ల సౌమ్య పుట్టినరోజు సందర్భంగా మజ్జిగ వితరణ



**ఖమ్మం( ప్రభాత సూర్య ప్రతినిధి):** నేలకొండపల్లి ఎస్బిఐ బ్యాంకు వద్ద భద్ర రామదాసు సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత మజ్జిగ పంపిణీ తెల్లగొర్ల లింగస్వామి -దేవి నాగమణి దంపతుల చిన్న కుమార్తె తెల్లగోర్ల సౌమ్య పుట్టినరోజు సందర్భంగా 500 మందికి మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తెల్లగోర్ల లింగస్వామి మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయటం ఒక అదృష్టం పేదవారికి లేని వారికి మనకు ఉన్నదానిలో ఎంతో కొంత సేవా దృక్పథంతో దానం చేయడం సేవ చేయటం మంచిది అని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో భక్త రామదాసు సర్వీస్ సొసైటీ అధ్యక్షులు పచ్చ తిరుపతయ్య మాజీ అధ్యక్షులు ఏటుకురి వెంకట వెంకట రామారావు నాగేశ్వరరావు ఉపాధ్యక్షుడు తెలగొర్ల లింగస్వామి కోడూరి వెంకటాచారి మాజీ ఎంపిటిసి గుడిపాటి ముక్కంటి మేకల వెంకయ్య ఈసీ సభ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా బి ఆర్ ఎస్ నేత మారబోయిన రవి యాదవ్ జన్మదిన వేడుకలు..

**పాల్గొన్న బేరి రామచందర్ యాదవ్..**



శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :శేరిలింగంపల్లి బిఆర్ఎస్ పార్టీ డివిజన్ ఇంచార్జ్ మారబోయిన రవి యాదవ్ జన్మదిన వేడుకలు పాపి రెడ్డి కాలని లో గల మల్టీ పర్పస్ పంక్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రవి యాదవ్ ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన బీసీ కులాల ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్. ఈ సందర్భంగా మాట్లాడుతూ మారబోయిన రవి యాదవ్ మునుముందు ఉన్నత పదవులు రావాలని మనస్ఫూర్తిగా భగవంతుని వేడుకొంటూ రవి యాదవ్ యువతరం రాజకీయంలోకి రావాలి మంచి పరిపాలన అందించాలని కోరారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ బహుజనులకు రాజ్యాధికార ఫలాలు అందాలని అన్నారు భేరి రామచంద్ర యాదవ్. యువతకు రాజకీయలో ముందుకు రాణించాలని నేటి సమాజంలో యువత మంచి ఆలోచన తోటి మంచి రాజకీయంతో పేద మధ్య తరగతి బడుగు బలహీన వర్గాలకు సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతాజీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కాలనీ ఉపాధ్యక్షులు రాయుడు, గోపి నగర్ బిసి నాయకులు నరసింహా గౌడ్ వెంకటేష్ మేస్త్రి, సందీప్ యాదవ్, రాజు గౌడ్, మేదరి మహేంద్ర సంఘం వెంకట్, గోపాల్ యాదవ్, రాజు యాదవ్, కిరణ్ ముదిరాజ్, శేరిలింగంపల్లి డివిజన్ లో ప్రజా ప్రతినిధులు యువజన నాయకులు మహిళా సోదరులు పెద్ద ఎత్తున పాల్గొని మారిపోయిన రవికుమార్ యాదవ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



## ఘనంగా ఎన్టీఆర్ 103వ జయంతి వేడుకలు..

శేరిలింగంపల్లి ప్రభాత సూర్య: ఎన్టీఆర్ 103 వ జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించిన శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇంచార్జ్ వి జగదీశ్వర్ గౌడ్ ,మియాపూర్ యువ నాయకులు యలమంచి ఉదయ్ కిరణ్.తెలుగు జాతి గర్వకారణం, పద్మశ్రీ పురస్కార గ్రహీత, మహానటుడు, దూరదృష్టి కలిగిన మహానేత డాక్టర్ నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) 103వ జయంతి వేడుకలు మియాపూర్ పరిధిలోని జేపీ నగర్ , దీప్తి శ్రీనగర్ డివిజన్‌లలో ఘనంగానిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాలకు టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ,శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్ , మియాపూర్ యువ నాయకులు యలమంచి ఉదయ్ కిరణ్ , నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అభిమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు, అభిమానులు, కార్యకర్తలు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు తెలుగు ప్రజలకు ఆత్మగౌరవాన్ని తీసుకువచ్చిన మహానేతను స్మరించుకుంటూ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు మాట్లాడుతూ ఎన్టీఆర్ కేవలం ఒక నాయకుడు మాత్రమే కాకుండా ఓ మహా విప్లవం, తరతరాలకు స్ఫూర్తిగా నిలిచే మహనీయుడని పేర్కొన్నారు. మహిళలకు ఆస్తి హక్కులు, వికేంద్రీకృత పాలన, పేదలకు గృహాల కల్పన, రూ.2 కిలో బియ్యం పథకం వంటి ఎన్నో సంక్షేమ కార్యక్రమాల ద్వారా ఎన్టీఆర్ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని తెలిపారు.సమాజమే దేవాలయం -- ప్రజలే దేవుళ్లు" అనే ఎన్టీఆర్ సిద్ధాంతం నేటికీ సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తోందని అన్నారు.ఈ కార్యక్రమంలో మన్నేపల్లి సాంబశివరావు, కావూరి ప్రసాద్,కట్ల శేఖర్ రెడ్డి,సునీల్ ,గిరి,అశోక్,బాలకృష్ణ,కృష్ణ గౌడ్,శ్రీనివాస్, నాని, గురువులు, రాధాకృష్ణ, చారి, రామ్, వెంకటేష్, ప్రవీణ్, సాయి తదితరులు పాల్గొని ఎన్టీఆర్ కి ఘన నివాళులు అర్పించారు.

## ఫలించిన ఈదులకుంట చెరువు పరిరక్షణలో సిపిఐ పోరాటం....




శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ఖానామెట్ సర్వే నెంబర్ 7లో ఉన్న సుమారు 6 ఎకరాల 5 గుంటల ఈదులకుంట చెరువు భూమిని కబ్జా నుంచి కాపాడడంలో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) పోరాటం కీలక పాత్ర పోషించిందని పార్టీ నాయకులు తెలిపారు. కోట్ల రూపాయల విలువైన చెరువు భూమిని సర్వే నెంబర్లను తారుమారు చేసి ఆక్రమించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని గుర్తించిన సిపిఐ నాయకులు, అక్కడ జరుగుతున్న సెల్లార్ తవ్వకాల పనులను అడ్డుకుని అధికారుల దృష్టికి విషయం తీసుకెళ్లారు.ఎమ్మార్వో, ఆర్డీవో, కలెక్టర్, ఇరిగేషన్ అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు అందజేసి చెరువు భూమిని రక్షించాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. అవసరమైతే ధర్నాలు, ఆందోళనలు నిర్వహించి అసెంబ్లీలో కూడా ఈ అంశాన్ని లేవనెత్తుతామని హెచ్చరించినట్లు పేర్కొన్నారు.అధికారుల నిర్లక్ష్యం ఉన్నప్పటికీ చివరకు హైడ్రా జోక్యంతో చెరువు భూమి రక్షించబడటం ఆనందకరమని సిపిఐ నాయకులు అన్నారు. చెరువును వెంటనే సుందరీకరించి, రానున్న వర్షాకాలంలో పూర్వ వైభవంతో నీటితో నింపాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. చెరువు పరిరక్షణ కోసం పోరాడిన ప్రజలు, రిపోర్టర్లు, కార్యకర్తలు మరియు సహకరించిన ప్రతి ఒక్కరికీ సిపిఐ పార్టీ తరఫున విప్లవ శుభాకాంక్షలు తెలిపారు.. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు. సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు టి రామకృష్ణ. సిపిఐ శేర్లింగంపల్లి నియోజకవర్గం కార్యదర్శి కే చందు యాదవ్. సిపిఐ జిల్లా సమితి సభ్యులు కే వెంకటస్వామి కే సుధాకర్. జెట్టి శ్రీనివాస్ మండల సహకార దర్శి. కోన సుధాకర్ మండల్ నాయకుడు. తుపాకుల రాములు మండల ఐఐటిసి అధ్యక్షులు. ఎస్ నారాయణ రఘు తదితరులు పాల్గొన్నారు

## బక్రీద్ సందర్భంగా మైనారిటీ నాయకులను కలిసిన ఆదర్శ్ రెడ్డి

పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి బక్రీద్ పండుగ సందర్భంగా మైనారిటీ నాయకులు ఘౌస్ భాయ్, కుతుబుద్దీన్‌ను కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకుని సోదరభావంతో పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కుమార్ గౌడ్, నర్సింహ పాల్గొన్నారు.



# దివ్యాంగుల పట్ల సామాజిక బాధ్యత ఉండాలి

### సివియర్ డిసబిలిటీ వెల్ఫేర్ సొసైటీ 14వ వార్షికోత్సవ వేడుకలు...

### దివ్యాంగ బాధితులకు నిత్యవసర సరుకులు అందజేత...చౌటుప్పల్ సిఐ జి.మన్మధ కుమార్

**చౌటుప్పల్,మే 28, ప్రభాత సూర్య :** మానవతా దృక్పథంతో దివ్యాంగులను ఆదుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా గుర్తించి సహకారం అందించాలని చౌటుప్పల్ సీఐ జి.మన్మధ కుమార్ అన్నారు. గురువారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని జయశ్రీ ఫంక్షన్ హాల్లో సివియర్ డిసబిలిటీ వెల్ఫేర్ సొసైటీ యాదాద్రి జిల్లా 14వ వార్షికోత్సవ వేడుకలను హైదరాబాద్ కు చెందిన గౌరీషా ఫౌండేషన్ ఫౌండర్స్ కర్నాటి అనిల్ స్వప్న దంపతుల సహాయార్థంతో 45 మంది దివ్యాంగులకు 2000 రూపాయల విలువైన నిత్యవసర సరుకులను సిఐ జి.మన్మధ కుమార్ చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఐ జీ.మన్మధ కుమార్ మాట్లాడుతూ... దివ్యాంగులకు సేవ చేయడం అభినందనీయమని అన్నారు. బాధితులకు ఎలాంటి సమస్యలు వచ్చినా తమ దృష్టికి తీసుకువస్తే చట్టపరంగా తక్షణమే పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. దివ్యాంగులకు తన వంతు సహాయ సహకారాలను అందిస్తానన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవడం సంతోషంగా ఉందన్నారు.సైబర్ క్రైమ్ దృష్టిలో ఉంచుకొని అందరూ అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. దివ్యాంగులను ఎవరైనా కించపరిచే వ్యాఖ్యలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



**దివ్యాంగులకు సేవ చేయడం సంతృప్తినిచ్చింది:కత్తుల బాలకృష్ణ**

14 వార్షికోత్సవ వేడుకల కార్యక్రమంలో పాల్గొన్న సొసైటీ అధ్యక్షులు కత్తుల బాలకృష్ణ పాల్గొని మాట్లాడుతూ..14 ఏళ్ల సేవా కార్యక్రమాలు తనలో మరింత బాధ్యత పెంచాయని అన్నారు. మనసున్న దాతలు తనను వెన్ను తట్టి ప్రోత్సహిస్తున్న ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. దాతల సహాయ సహకారాల వల్లనే తన సేవా కార్యక్రమాలు చేయగలుగుతున్నానని తెలిపారు. బాధితుల స్థితిగతులను వివరించారు. దివ్యాంగులను కించపరిచిన, అవమానపరిచిన 92 సెక్షన్ ప్రకారం చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సీఐ ను కోరారు. దివ్యాంగులకు తన వంతుగా సహాయం అందించడం తనకు ఎంతో సంతృప్తిని కలిగించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాతృశ్రీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు పి యాదయ్య, ప్రతిభ ఒకేషనల్ కాలేజ్ ప్రిన్సిపాల్ సిలువేరు శ్రీనివాస్, ప్రకాష్, తండ మహేష్, దివ్యాంగ బాధితులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ జన్మదిన సందర్భంగా మెగా బ్లడ్ క్యాంపు, మెగా హెల్త్ క్యాంపు..

శేరిలింగంపల్లి ప్రభాత సూర్య : విశ్వవిఖ్యాత నటసార్వభౌమ స్వర్గీయ డాక్టర్ నందమూరి తారక రామారావు 103 వ పుట్టినరోజు సందర్భంగా గోకుల్ ప్లాట్స్ మధుర బాంకెట్ హాల్లో ఏర్పాటుచేసిన మెగా బ్లడ్ క్యాంప్ , హెల్త్ క్యాంప్ లను ఏర్పాటు చేయడం జరిగినది. ఈ మెగా క్యాంపు కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఏమ్ ఎల్ ఏ అరెకపూడి గాంధి , మాజీ రాజ్యసభ సభ్యులు గరికపాటి మోహనరావు , బండి రమేష్ , రాష్ట్ర నాయకులు మొవ్వ సత్యనారాయణ, మహా న్యూస్ సి.ఎం.డి మరెళ్ళ వంశి కృష్ణ , శేర్లింగంపల్లి జోన్ డిసిపి చింతమనేని శ్రీనివాస్ , మియాపూర్ తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, మాదాపూర్ ట్రాఫిక్ ఏ సి పి చంద్ర శేఖర్ రెడ్డి శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు, ప్రసాద్స్ ఫౌండేషన్ చైర్మన్ లయన్ డి.ఎస్.ఆర్.కె ప్రసాద్ , హైదర్ నగర్ తాజా మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు , ప్రసాద్స్ ఫౌండేషన్ డైరెక్టర్ లీలా ప్రసాద్, గురుమూర్తి , గోనుగుంట్ల వెంకట్రావు , బండారు బాబు, కిలారు కోటి రాఘవులు, ఏం నాగార్జున , జి.అభినాష్, జి. స్వాములు, కె. వెంకటేష్, మన్నె రాధాకృష్ణ, కె.రాంబాబు, ఏం జనార్దన్, జే. శ్రీకాంత్, కె. రత్నం, కె. హరికృష్ణ, జి. అశోక్, కె హనుమంతరావు, పాల్గొన్నారు. యెన్ టి ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి ఆదేశాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు . ప్రసాద్ ఫౌండేషన్ చైర్మన్ శ్రీ డి ఎస్ ఆర్ కె ప్రసాద్, శ్రీ లీలా



ప్రసాద్ గారి ఆధ్వర్యంలో 17 వ బ్లడ్ డొనేషన్, ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ టి ఆర్ ట్రస్ట్, మెడికవర్ హాస్పిటల్స్, హోలిస్టిక్ హాస్పిటల్స్, పాల్గొన్నాయి. సుమారు బ్లడ్ 411 యూనిట్స్ కలెక్ట్ చేయడం జరిగింది, దాదాపు 800 మంది వైద్య పరీక్షలు చేయించు కోవడం జరిగింది. అందరికి ఎన్ టి ఆర్ ట్రస్ట్ తరుపున సర్టిఫికెట్స్, ఎన్ టి ఆర్ 2026 క్యాలెండర్ మరియు కిట్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి టిఫిన్స్, బోజనాలు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి, సహకరించిన ప్రతి ఒక్కరికి, ఎన్ టి ఆర్ ట్రస్ట్ కి వారి సిబ్బంది కి,బాంక్వెట్ హాల్ అధిపతి గోనుగుంట్ల వెంకట్రావు కి వారి సిబ్బంది కి, మెడికవర్ హాస్పిటల్ సిబ్బంది కి, యాజమాన్యానికి, హోలిస్టిక్ హాస్పిటల్ సిబ్బంది కి, యాజమాన్యానికి, వైద్యులకు, ముఖ్యంగా ఆర్గనైజర్స్ అందరి, బ్లడ్ డోనర్స్ కి పేరు పేరున కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియ చేసిన ప్రసాద్స్ ఫౌండేషన్ చైర్మన్ డి ఎస్ ఆర్ కె ప్రసాద్.

## బిజెపి నాయకులను ముందస్తు అరెస్ట్..

**ఆలేరు మే 28 ప్రభాత సూర్య .. :** జిల్లాలో రాష్ట్ర మంత్రివర్యులు పర్యటన సందర్భంగా ముందస్తుగా ఆలేరు భారతీయ జనతా పార్టీ నాయకులను అరెస్టు చేసిన స్థానిక పోలీసులు. ఆలేరు లో అక్రమ అరెస్టులను ఖండించాలని బీజేపీ నాయకులు అన్నారు. అరెస్టు అయిన నాయకులు పట్టణ అధ్యక్షుడు నంద గంగేష్, జిల్లా కార్యదర్శి కమిటీకారీ కృష్ణ, జిల్లా నాయకులు మల్ రెడ్డి నరసింహారెడ్డి, తునికి దశరథ, సముద్రాల శ్రీనివాస్ , పట్టణ మాజీ అధ్యక్షుడు బడుగు జహంగీర్ , జిల్లా కౌన్సిల్ మెంబర్ వడ్డమాని నరేందర్ , పట్టణ ప్రధాన కార్యదర్శి ఎలగల వెంకటేష్ తదితరులు ఉన్నారు.





## బక్రీద్ వేడుకల్లో పాల్గొన్న మాద్రి పృథ్వీరాజ్

**పటాన్చెరు, మే 28,ప్రభాత సూర్య :** త్యాగం, భక్తి, సోదరభావానికి ప్రతీకగా జరుపుకునే పవిత్ర బక్రీద్ పండుగ సందర్భంగా పటాన్చెరు పట్టణంలోని మురాద్ అలీ షా దర్గా వద్ద నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో బీఆర్ఎస్ నాయకుడు, ఎండీఆర్ ఫౌండేషన్ సహ వ్యవస్థాపకుడు మాద్రి పృథ్వీరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలు నిర్వహించి బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజంలో ప్రేమ, ఐక్యత, పరస్పర గౌరవ భావాలు మరింత పెంపొందాలని ఆకాంక్షించారు. బక్రీద్ పండుగ త్యాగం, మానవత్వం, దైవభక్తికి నిదర్శనమని పేర్కొంటూ అన్ని మతాలు శాంతి, ప్రేమ, సోదరభావాన్నే బోధిస్తాయని తెలిపారు. ప్రజలంతా కలిసిమెలిసి సుఖశాంతులతో జీవించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో గూడెం మధుసూదన్ రెడ్డి, బాయికాడి విజయ్, శ్రీధర్ చారి, ధనరాజ్ గౌడ్, గుండమోల్ల రాజు, వీరారెడ్డి, ముస్లిం సోదరులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ప్రపంచ రికార్డు గుర్తింపుతో పాటు

## అంబేద్కర్ ఎక్సలెన్సీ అవార్డు అందుకున్న బి.రాజ్‌కుమార్





**ఇబ్రహీంపట్నం, ప్రభాత సూర్య ప్రతినిధి మే 27 :** సామాజిక సేవా, సాంస్కృతిక కార్యక్రమాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు బి.రాజ్‌కుమార్ అరుదైన గౌరవాన్ని అందుకున్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 135వ జయంతి వేడుకల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు "అంబేద్కర్ ఎక్సలెన్సీ అవార్డు--2026" ప్రదానం చేశారు. కళానిలయం సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్ అబిడ్స్‌లోని తెలంగాణ సరస్వత పరిషత్‌లో నిర్వహించిన ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమంలో ఒకే వేదికపై 135 మంది కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించిన సందర్భంగా ఏర్పాటుచేసిన విశేష కార్యక్రమానికి రాజ్‌కుమార్ అందించిన సేవలను గుర్తిస్తూ గోల్డెన్ స్టార్ వరల్డ్ రికార్డ్స్ ఫోరం సర్టిఫికేట్‌ను అందజేసింది. ఈ సందర్భంగా రాష్ట్ర మాజీ స్పీకర్ మధుసూదనాచారి చేతుల మీదుగా ఆయన అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమం ప్రపంచ రికార్డు స్థాయిలో గుర్తింపు పొందినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా బి.రాజ్‌కుమార్ మాట్లాడుతూ... తనకు లభించిన ఈ గౌరవాలు సమాజ సేవకు మరింత ప్రేరణనిస్తాయని అన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాల సాధనకు కట్టుబడి పనిచేస్తూ సామాజిక అభివృద్ధికి తన వంతు కృషి కొనసాగిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, సామాజికవేత్తలు, సాంస్కృతిక రంగ ప్రముఖులు పాల్గొని బి.రాజ్‌కుమార్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఆయనకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేసి ఘనంగా సత్కరించారు. కాగా, రాజ్‌కుమార్ కుమారుడు, ఎన్ఎస్‌యూఐ నాయకుడు బి.వినయ్ కుమార్ కూడా అంబేద్కర్ జయంతి వేడుకల సందర్భంగా ప్రదానం చేసిన "అంబేద్కర్ ఎక్సలెన్సీ అవార్డు--2026" అందుకోవడం విశేషం. తండ్రి, కుమారుడు ఒకే కార్యక్రమంలో ప్రతిష్టాత్మక అవార్డులు అందుకోవడంతో కుటుంబ సభ్యులు, మిత్రులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి అవార్డులు, ప్రశంస పత్రాలు మరిన్ని అందుకోవాలని పలువురు ఆకాంక్షించారు.

# మోడీ బీ జే పీ కేంద్ర ప్రభుత్వానికి కార్పోరేట్ సంస్థలపై ఉన్న ప్రేమ

### రైతులపై లేదు

### ఆలేరు వ్యవసాయ మార్కెట్ యార్డు లో కనీస మద్దతు ధర ఆర్డర్ ప్రతులను దహనం చేసిన రైతులు




**ఆలేరు మే 28 ప్రభాత సూర్య.:** కేంద్రంలో బీజేపీ నరేంద్ర మోడీ ప్రభుత్వం కు దేశంలో బడా కార్పోరేట్ సంస్థల అధిపతులపై ఉన్న ప్రేమ, దేశానికి తిండి పెడుతున్న రైతన్నలపై లేదని అఖిల భారత రైతు.కూలీ సంఘం(ఏ ఐ కే ఎం ఎస్)రాష్ట్ర అద్యక్షులు మామిడాల భిక్షపతి, జిల్లా అద్యక్షులు కల్లెపు అడివయ్య స్పష్టం చేశారు.మే 27 నుండి 31 వరకు మోడీ నామ మాత్రం కనీస మద్దతు ధర ను వ్యతిరేకిస్తూ ఆర్డర్ ప్రతులను దహనం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్ కే ఎం) ఇచ్చిన పిలుపు మేరకు గురువారం రోజున ఆలేరు వ్యవసాయ మార్కెట్ యార్డు లో ఏ ఐ కే ఎం ఎస్ ఆధ్వర్యంలో రైతులు కనీస మద్దతు ధర ఆర్డర్ ప్రతులను దహనం చేశారు.ఈ సందర్భంగా భిక్షపతి, అడివయ్య మాట్లాడుతూ,వారికి క్వింటాకు కేవలం 72/- ప్రకటించడం అంటే రైతులను మోడీ ప్రభుత్వం అడుకునే వాళ్ళు గా చూస్తుందని,అందుకే కనీస మద్దతు ధర అంటే బీ జే పీ కి భిక్షం వేసినట్లుగా చూస్తుందని ఆరోపించారు. కష్టపడి లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టి పుట్ల కొద్ది ధాన్యాన్ని దేశానికి అందిస్తే ఆ రైతు శ్రమను,పెట్టుబడిని ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకుండా ఎంగిలి మెతుకులు విసిరినట్లుగా కింటా కు 72/- ప్రకటించడం దేనికి నిదర్శనమో రైతులు అర్థం చేసుకుంటున్నారని అన్నారు.వారంలో అయిదుసార్లు పెట్రోల్, డీజిల్ ధరలను పెంచిన మోడీ బీ జే పీ,రైతులకు కనీస గిట్టుబాటు ధరలు ప్రకటించకపోవడం అన్యాయం అని అన్నారు.రైతు లేనిదే రాజ్యం లేదని చెప్పే పాలకులు ఆ రైతు వెన్నుపూస ను విరగొడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐ ఎఫ్ టి యు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్.జనార్ధన్, జిల్లా అద్యక్షులు పద్మ సుదర్శన్, ఏ ఐ కే ఎం ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు చిర బోయిన రాజయ్య,జిల్లా నాయకులు పిన్నపురెడ్డి రాఘవ రెడ్డి,తమ్మడి అంజయ్య,మార్కెట్ యార్డు హమాలీ కార్మిక నాయకులు కర్రె శ్రీకాంత్, దొప్ప వెంకటేష్,కడకంచి మహేష్, కర్రె మల్లేష్, జోగు కుమార్,బాలరాజు,దడిగే రవి, అయిల కృష్ణ,కె.సురేష్, ఏ ఐ కే ఎం ఎస్ జిల్లా నాయకులు కొమ్మిడి గోపాల్ రెడ్డి, పీ వై ఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాదుల శ్రీకాంత్,గోవిందు పరమేశ్,రైతు.కూలీలు ఆలేటి యాదగిరి, ఆలేటి మంగమ్మ, ఐ ఎఫ్ టి యు నాయకులు దార యాదగిరి, కల్లెపు చంద్రయ్య,ఓరుగంటి మైసయ్య,కొమ్మిడి శ్రీకాంత్ రెడ్డి,నర్సింహారెడ్డి, ఊరడి రామ చంద్రు, ఆకుల కృష్ణ,కొమ్మిడి గాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు జయంతి వేడుకలు

**వివేకానంద నగర్‌లో ఎన్టీఆర్ జయంతి వేడుకలు వైభవంగా నిర్వహణ..ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ హాజరు**





**ంకూకట్ పల్లి, మే 28 (ప్రభాత సూర్య) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం, వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని మెయిన్ రోడ్డులో ఏర్పాటు చేసిన స్వర్గీయ నటసార్వభౌముడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శేర్లింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, పీఏసీ చైర్మన్ హాజరై ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో హాజరైన ఎన్టీఆర్ అభిమానులు, స్థానిక ప్రజలు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు కలిసి ఎన్టీఆర్ ని స్మరించుకుంటూ పూలతో నివాళులు అర్పించారు. కార్యక్రమ ప్రాంగణం మొత్తం ఎన్టీఆర్ చిత్రపటాలు, జెండాలు, నినాదాలతో కళకళలాడింది. అభిమానుల హర్షధ్వానాల మధ్య ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కేక్ కట్ చేసి అభిమానులకు కేక్, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ మాట్లాడుతూ ఎన్టీ రామారావు తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, మహిళలకు ఆస్తి హక్కు కల్పించడం, పేదలకు ఉచిత బియ్యం అందించడం, మారుమూల గ్రామాలకు రోడ్లు, మంచినీరు, విద్యుత్, రవాణా సౌకర్యాలు కల్పించడం వంటి అనేక సంక్షేమ పథకాలతో ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారు" అని పేర్కొన్నారు. అలాగే రాజకీయాల్లో సామాన్య ప్రజలకు అవకాశాలు కల్పించి ఎంతో మందిని ఉన్నత స్థానాలకు తీసుకెళ్లిన మహనీయుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. నేడు భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పాలన తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయి" అని ఎమ్మెల్యే గాంధీ అన్నారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జనంపల్లి పురేందర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆశయాలను యువత ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకలకు హాజరైన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్రకాంతరావు, సంజీవరెడ్డి, రామకృష్ణ, మల్లయ్య, లింగయ్య, లక్ష్మీబాయి, యాదగిరి, శ్రీధర్, సూర్యనారాయణ, మూర్తి, జి.ప్రసాద్, రామ్ రెడ్డి, చల్లారావు, సునీల్ పటేల్, కిషోర్ గ్రానైట్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఎన్టీఆర్ జయంతి వేడుకలతో వివేకానంద నగర్ ప్రాంతం పండుగ వాతావరణాన్ని తలపించింది. అభిమానులు ఎన్టీఆర్ నినాదాలతో ప్రాంతాన్ని మార్మోగించి, ఆయన సేవలను స్మరించుకుంటూ ఘనంగా నివాళులు అర్పించారు.



## ధాన్యం కొనుగోళ్లలో జాప్యంపై టీఆర్ఎస్ ఆందోళన

### తోపుడు బండిపై వరి ధాన్యంతో కొలనుపాక నుంచి ఆలేరు మార్కెట్ యార్డ్ వరకు నిరసన ర్యాలీ



**ఆలేరు మే 28 ప్రభాత సూర్య..:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని కొలనుపాక ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రక్షణ సేన పార్టీ నాయకుడు మణిపాల్ రెడ్డి గురువారం వినూత్న నిరసన చేపట్టారు. వరి ధాన్యాన్ని తోపుడు బండిపై వేసుకుని కొలనుపాక ఐకేపీ కేంద్రం నుంచి ఆలేరు మార్కెట్ యార్డ్ వరకు నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎన్నో కష్టాలు పడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని, తరలింపు సౌకర్యాలు లేకపోవడం, గన్నీ బ్యాగుల కొరత, తూకాల్లో ఆలస్యం వంటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయని పేర్కొన్నారు.ప్రభుత్వం వెంటనే స్పందించి రైతుల ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## చండూర్ లో ఘనంగా బక్రీద్ వేడుకలు.....



**ప్రభాత సూర్య చండూర్:** చండూరు మున్సిపాలిటీ పరిధిలో గురువారం బక్రీదు పండుగ సందర్భంగా ఈద్గా వద్ద ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మత గురువు ముజాహిద్ మాట్లాడుతూ విశ్వాసానికి, కరుణ, ఐక్యతకు ప్రతీక బక్రీద్ పండుగ అని, ఈ పండుగ రోజున సమస్త మానవాళికి శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ త్యాగ నిరతికి, ధర్మ నిబద్ధతకి ప్రతీక ,అని ఆయన అన్నారు.అత్యంత భక్తి శ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో బక్రీద్ పండుగ జరుపుకున్నారు. అనంతరం ముస్లిం సోదరులు ఒకరిని ఒకరు కలిసి శుభాకాంక్షలు తెలియ చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కమ్రుద్దీన్ ,కరెంట్ షరీఫ్,ఏజాస్,నిరంజన్ అలీ,జిన్నా,సాదక్,షజ్జు పాష ,ఉమర్, ఖలీల్, యూనస్,ముజ్జు,లతీఫ్ పాష, రహీం బాబా, హైమద్, జమీల్,షరీఫ్ , జన్ను,వహీద్ , అజీమ్, మాజిద్, ముస్తఫా, రఫీ, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

## జూన్ 3న టీయూడబ్ల్యూజే జిల్లా మహాసభకు జర్నలిస్టులు తరలిరావాలి: డివిజన్ అధ్యక్షుడు జిల్లా యాదయ్య



**నల్గొండ ప్రభాత సూర్య:** నకిరేకల్ నియోజకవర్గ కేంద్రంలో జూన్ 3వ తేదీన నిర్వహించనున్న టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా మహాసభకు జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆసంఘం నల్లగొండ డివిజన్ అధ్యక్షుడు జిల్లా యాదయ్య, ప్రధాన కార్యదర్శి కత్తుల యాదగిరి లు పిలుపునిచ్చారు. గురువారం నల్లగొండ పట్టణంలో నిర్వహించిన టీయూడబ్ల్యూజే సమావేశంలో వారు మాట్లాడుతూ.. నల్లగొండ డివిజన్‌లో చేపట్టిన సభ్యత్వ నమోదు ప్రచారానికి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు,చిన్న పత్రికల జర్నలిస్టులు,ఫోటో జర్నలిస్టులు, వీడియో జర్నలిస్టుల నుంచి అనూహ్యమైన స్పందన లభిస్తోందన్నారు.జిల్లాలో అర్హులైన జర్నలిస్టులకు ఇంటి స్థలం, గృహ నిర్మాణం, హెల్త్ కార్డులు, అక్రిడిటేషన్ కార్డులు అందేలా యూనియన్ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారానికి ఈ జిల్లా మహాసభ వేదిక కానుందని ఈ మాసభకు మహాసభకు లినకిరేకల్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ వేముల వీరేశం, తెలంగాణ రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి,టియూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.రామ నారాయణ ,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.ప్రభాకర్ రెడ్డి జిల్లా అధ్యక్షులు గార్లపాటి కృష్ణారెడ్డిలు హాజరవుతున్నట్లు తెలిపారు.సమావేశంలో సంఘం నాయకులు చింత యాదగిరి, తెల్గమల్ల దశరథ్, బోగారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.అనంతరం సంఘం సభ్యత్వం అందజేశారు.

# మిర్యాలగూడలో ఘనంగా ఇందిరమ్మ చీరెల పంపిణి

# ప్రారంభించిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

## మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న ప్రజా ప్రభుత్వం

## అర్హులైన ప్రతి ఆడపడుచుకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందిస్తాం: ఎమ్మెల్యే బిఎల్ఆర్





**మిర్యాలగూడ మే 28:-( ప్రభాత సూర్య):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరా మహిళా శక్తి - ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం మిర్యాలగూడ పట్టణం హౌసింగ్ బోర్డు లో అత్యంత వైభవంగా జరిగింది. శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ పట్టణ పరిధి హౌసింగ్ బోర్డు 4, 5, 15, 16, 17 వార్డు లకు చెందిన ఆడపడుచులకు ఇందిరమ్మ చీరలను స్వయంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూమహిళల ఆత్మగౌరవాన్ని పెంపొందించడం, సంక్షేమానికి అండగా నిలవడమే ధ్యేయంగా సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ఈ ఇందిరమ్మ చీరల పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కోటి మంది మహిళలకు కోటి చీరలను పంపిణీ చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని గుర్తుచేశారు.రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, ఇందిరమ్మ క్యాంటీన్లు, మహిళా శక్తి బృందాల (డ్వాక్రా సంఘాలు) బలోపేతానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు.గ్రామీణ ప్రాంతాలు, పట్టణాల్లోని ప్రతి అర్హురాలైన మహిళకు, డ్వాక్రా గ్రూప్ సభ్యులకు సంక్షేమ ఫలాలు అందేలా పారదర్శకంగా పంపిణీ చేపడుతున్నామన్నారు. ఆడపడుచుల అభిరుచులకు అనుగుణంగా, అత్యంత నాణ్యమైన రీతిలో ఈ ఇందిరమ్మ చీరలను ప్రభుత్వం తయారు చేయించి ఉచితంగా అందిస్తోందన్నారు.అనంతరం ఎమ్మెల్యే లబ్ధిదారులకు చీరలు అందజేసి, పట్టణ మహిళలందరికీ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.ప్రభుత్వం ఉచితంగా అందజేసిన ఇందిరమ్మ చీరలను అందుకున్న మహిళలు హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డి, స్థానిక కౌన్సిలర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, డ్వాక్రా మహిళా సంఘాల ప్రతినిధులు, బిఎల్ఆర్ బ్రదర్స్, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



# యశోద ఆసుపత్రిలో క్యాన్సర్ కు ఆధునిక వైద్యం: డాక్టర్ నివాళిక

**మిర్యాలగూడ మే 28: -( ప్రభాత సూర్య):** హైదరాబాద్ మలక్ పేట యశోద ఆసుపత్రిలో క్యాన్సర్ వ్యాధికి ఆధునిక చికిత్స అందుబాటులో ఉన్నదని ఆసుపత్రి సీనియర్ కన్సల్టెంట్ రేడియేషన్ ఆంకాలజిస్ట్ నివాళిక రాజమోని అన్నారు. గురువారం పట్టణంలోని స్వాగత్ గ్రాండ్ కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె క్యాన్సర్ చికిత్స విధానంపై వివరించారు. క్యాన్సర్ పెరగడానికి ప్రధాన కారణం కల్తీ కలిసిన ఆహారం ఆహారం తయారీకి ఉపయోగించే రంగులు, ప్లాస్టిక్ ప్లేట్లు గ్లాసులు అత్యధికంగా వాడటం వలన ప్రజలు క్యాన్సర్ బారిన పడుతున్నారని తెలిపారు. క్యాన్సర్ వ్యాధిని ప్రారంభ స్టేజీలోనే గుర్తించాలంటే 'పెట్ సిటీ స్కాన్' వలన వ్యాధి ఏ స్టేజిలో ఉన్నది అనేది తెలిసిపోతుందని వివరించారు. ప్రస్తుతం క్యాన్సర్ వ్యాధిని నివారించేందుకు రేడియేషన్ కీమోథెరపీలు అందుబాటులో ఉన్నాయని సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో ఇటీవల హైపర్ సైట్ మిషన్ ద్వారా అత్యాధునిక చికిత్స విధానం అందుబాటులోకి వచ్చిందని వివరించారు. అదేవిధంగా రోగి ఆరోగ్య పరిస్థితిని బట్టి అడ్వాన్స్ మెడిసిన్ ఇమ్యునోథెరపీ విధానం అందుబాటులోకి వచ్చిందన్నారు. యశోద ఆసుపత్రిలో అన్ని రకాల క్యాన్సర్లకు అత్యాధునిక చికిత్స విధానం అందుబాటులో ఉన్నదని రోగులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా పట్టణంలోని సూర్య డయాగ్నస్టిక్ సెంటర్ కు ప్రతినెల నాలుగవ బుధవారం క్యాన్సర్ సంబంధిత రోగులను చూడటం జరుగుతుందన్నారు. మిర్యాలగూడ పరిసర ప్రాంతాల ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో మేనేజర్ వాసుకిరణ్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

# నార్సింగి సర్కిల్ కోకాపేట్‌లో అక్రమ నిర్మాణాల అరాచకం

### 250 గజాల్లోనే సెల్లార్‌తో జి ం7 భవనాలు..!

### అధికారుల మౌనం వెనుక మర్మమేంటి..?

కోట్ల వ్యాపారంగా మారిన అక్రమ నిర్మాణాలు -- ప్రజల ప్రాణాలతో చెలగాటమా?





**గండిపేట్ :. సూర్య ప్రతినిధి:** హైదరాబాద్‌కు అత్యంత వేగంగా అభివృద్ధి చెందు తున్న ప్రాంతంగా పేరొందిన నార్సింగి సర్కిల్ కోకాపేట్ ఇప్పుడు అక్రమ నిర్మాణాల కేంద్రంగా మారిందన్న ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. నిబంధనలు, చట్టాలు, పట్టణ ప్రణాళిక అన్నీ పక్కనపెట్టి కొంతమంది బిల్డర్లు యథేచ్ఛగా భవనాలు నిర్మిస్తుండగా, సంబంధిత అధికారులు మాత్రం చూస్తూ ఊరుకోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.కేవలం 250 గజాల చిన్న స్థలాల్లోనే సెల్లార్‌తో కలిసి +ం7 అంతస్తుల వరకు భారీ భవనాలు నిర్మిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కనీస పార్కింగ్ స్థలం లేకుండా, ఫైర్ సేఫ్టీ ప్రమాణాలు పాటించకుండా, రోడ్డు వెడల్పు నిబంధనలను ఉల్లంఘిస్తూ నిర్మాణాలు కొనసాగు తున్నా ఇప్పటివరకు ఒక్క పెద్ద చర్య కూడా కనిపించకపోవడం చర్చనీయాంశమైంది.స్థానికుల ప్రకారం, కొంతమంది బిల్డర్లు "అనుమతులు తర్వాత చూసుకుందాం" అన్న ధోరణితో ముందుగా నిర్మాణాలు పూర్తి చేసి, తర్వాత రాజకీయ ఒత్తిళ్లు లేదా అధికార సంబంధాలతో వ్యవహారాలను సర్దుబాటు చేసుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. దీంతో చట్టాన్ని గౌరవించే సాధారణ ప్రజలు నష్టపోతుండగా, అక్రమార్కులు మాత్రం కోట్ల రూపాయలు ఆర్జిస్తున్నారని ప్రజలు మండి పడుతున్నారు.అక్రమ నిర్మాణాల కారణంగా కోకాపేట్ ప్రాంతంలో మౌలిక వసతులపై తీవ్ర ఒత్తిడి పెరుగుతోంది. ఇప్పటికే ట్రాఫిక్ సమస్యలు అధికమవుతుండగా, డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతింటోంది. తాగునీటి కొరత, పార్కింగ్ సమస్యలు రోజురోజుకు పెరుగుతున్నాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు వస్తే నీరు నిలిచిపోవడం, అత్యవసర వాహనాలు వెళ్లలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయని చెబుతున్నారు.అత్యంత ఆందోళనకర విషయం ఏమిటంటే --- ఈ అక్రమ నిర్మాణాల్లో నివసించే వారి భద్రత. ఫైర్ సేఫ్టీ ప్రమాణాలు లేకుండా, నాణ్యతలేని నిర్మాణ సామగ్రితో కట్టే భవనాలు భవిష్యత్తులో ప్రమాదాలకు దారితీసే అవకాశముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఒకవేళ అగ్ని ప్రమాదం లేదా నిర్మాణ ప్రమాదం జరిగితే దానికి బాధ్యత ఎవరు వహిస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు కేవలం నోటీసులకే పరిమిత మవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొన్నిచోట్ల అధికారులు వచ్చి పరిశీలించినా, రెండు రోజుల తర్వాత మళ్లీ పనులు యథావిధిగా కొనసాగుతున్నాయని చెబుతున్నారు. దీంతో "అధికారుల అండ లేకుండా ఇంత పెద్ద ఎత్తున అక్రమ నిర్మాణాలు ఎలా జరుగుతాయి?" అనే సందేహాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.కోకాపేట్ వంటి విలువైన ప్రాంతంలో అక్రమ నిర్మాణాలు నియంత్రణ లేకుండా కొనసాగితే భవిష్యత్తులో నగర ప్రణాళిక పూర్తిగా దెబ్బతింటుందని పట్టణాభివృద్ధి నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, హెచ్ఎండీఏ, మున్సిపల్ అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు."చట్టాలు సామా న్యులకేనా..? అక్రమార్కులకు వర్తించవా..?" అంటూ కోకాపేట్ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# బక్రీద్ పండుగ ఈదుగా ప్రార్థనలో పాల్గొని ఈద్ ముబారక్ తెలిపిన ఎమ్మెల్యే బి ఎల్ ఆర్



**మిర్యాలగూడ మే 28:- (ప్రభాత సూర్య సూర్య)** :మిర్యాలగూడ పట్టణం, మండలంలో త్యాగానికి, భక్తికి ప్రతీకగా నిలిచే ఈద్-ఉల్-అజ్హా (బక్రీద్)పండుగను గురువారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని అవంతిపురంలో ముఫ్తి రియాజ్, ముఫ్తి ఇమ్రాన్, టిక్యాతండా శివారులోని ఈద్గాహ్ లో మౌలానా మగ్దుం, హాఫిజ్ అక్బర్ నమాజ్ నిర్వహించారు. నమాజ్ అనంతరం పరస్పరం శుభాకాంక్షలు తెలిపారు. ఇళ్లలకు వెళ్లి ఆర్థిక స్థోమత ఉన్న వారు మేక పోతులు, గొర్రె పోతులు ఖుర్బాని ఇచ్చారు. పట్టణంలోని బంగారుగడ్డ ఈద్గాహ్ లలో వేలాది మంది ముస్లింలు నమాజ్ చేశారు. పురస్కరించుకుని మిర్యాలగూడ పట్టణం బంగారుగడ్డలోని ఈద్గా మైదానంలో ముస్లింలు నిర్వహించిన ప్రత్యేక నమాజ్ (ప్రార్థన)లో శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ ముస్లింలతో కలిసి నమాజ్ చేశారు. అందరికీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ బక్రీద్ పండుగ మానవాళికి త్యాగ నిరతిని, దైవభక్తిని, సోదరభావాన్ని చాటిచెబుతుం దన్నారు. సమాజంలో అందరూశాంతి సౌఖ్యాలతో, మతసామరస్యంతో కలిసిమెలిసి జీవించాలన్నదే పండుగ ఇచ్చే గొప్ప సందేశమన్నారు.అల్లాహ్ కరుణాకటాక్షాలతో నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని, ప్రత్యేకంగా ప్రార్థించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. మైనారిటీల సంక్షేమానికి తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందన్నారు.ప్రార్థనల అనంతరం మత పెద్దలు, ముస్లింలు ఎమ్మెల్యేని ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మహబూబ్ అలీ, స్థానిక కౌన్సిలర్లు అయూబ్, షేక్ అబ్దుల్లా, మొయిజ్, గిరిధర్, ఫారుక్, ముస్లిం ప్రముఖులు, పాల్గొన్నారు.



# ఎరువులను అధిక ధరలకు అమ్ముతున్నారన్న సమాచారంపై షాపుల తనిఖీ



**మిర్యాలగూడ మే 28:- (ప్రభాత సూర్య) :** మిర్యాలగూడ పట్టణంలోని ఎరువుల దుకాణాల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపణలు రావడంతో మిర్యాలగూడ ఇంచార్జి అసిస్టెంట్ డైరెక్టర్ ఎం. ఋష్యేంద్రమణి గురువారం నోటీసులు ఇచ్చి తనిఖీ చేశారు. పట్టణంలోని ఎంబి అక్కయ్య ఎరువుల దుకాణం, విశ్వామిత్ర ఆగ్రో కెమికల్స్, వెంకటరమణ ఏజెన్సీస్ దుకాణదారులు, నిర్వాహకులు మినిమం రిటైల్ ప్రైస్ (ఎంఆర్పి)కంటే అధిక ధరలకు డిఎపి, కాంప్లెక్స్ ఎరువులు అమ్ముతున్నారని వార్తలు రావడంతో జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్ కుమార్ ఆదేశాలతో ఆయా దుకాణాల్లో రిజిస్టర్లు, బిల్లు బుక్కులు పరిశీలించారు. చట్ట ప్రకారం ఎరువులు విక్రాయించాలని, వ్యతిరేకంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



## కాంగ్రెస్ సీనియర్ నాయకులు బాస శ్రీనివాస్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

**గండిపేట : సూర్య ప్రతినిధి:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాస శ్రీనివాస్ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. బాస శ్రీనివాస్ పుట్టిన రోజు సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ ఆయన నివాసంలో బాస శ్రీనివాస్‌ను శాలువాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు కేక్‌కట్ చేయించి తినిపించి మరిన్ని జన్మదినాలు జరుపుకోవాలని ఆకాంక్షిస్తు ప్రజా సేవలో ముందుండాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సరికొండ వెంకటేష్, సోమ శ్రీనివాస్ గుప్తా, ఎన్.ధనుంజయ్, ఓం ప్రకాష్, కోట పవన్ కుమార్ నేత,ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్‌ది చెరిగిపోని సంతకం

### ఎక్స్ వేదికగా చిరంజీవి నివాళి

హైదరాబాద్,మే28:ఎన్ని తరాలు మారినా మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు ప్రభావం చరిత్రలో ఎప్పటికీ చెరిగిపోదని మెగాస్టార్ చిరంజీవి అన్నారు. నందమూరి తారక రామారావు 103వ జయంతి సందర్భంగా చిరంజీవి ఘన నివాళులు అర్పించారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. 'ఎన్ని తరాలు మారినా ఆ తారక రాముని ప్రభావం చరిత్రలో ఎప్పటికీ చెరిగిపోదు'.. తెరపై అనేక పాత్రలను సజీవంగా ఆవిష్కరించిన మహానటుడిగా.. ప్రజా జీవితంలో తెలుగు జాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా.. అందరి హృదయాల్లో శాశ్వత స్థానాన్ని సంపాదించిన నందమూరి తారక రామారావు చిరస్మరణీయులు. ఇటీవల ఎన్టీఆర్ జాతీయ పురస్కారం నాకు లభించడం కూడా ఎంతో ప్రత్యేకమైన గౌరవంగా భావిస్తున్నాను. అది ఆయనపై నాకు ఉన్న గౌరవానికి మరింత విలువైన గుర్తింపుగా నిలిచిపోతుంది. ఆ మహనీయుని జయంతి సందర్భంగా వారిని స్మరించుకుంటూ..' అని రాసుకొచ్చారు.

# రైతుగా మారిన టెక్కీ

## పిడుగుపాటుకు గురై హఠాన్మరణం

బెగళూరు:సాఫ్ట్‌వేర్ జాబ్‌ను వదిలి వ్యవసాయ రంగంలోకి దిగిన ఒక వ్యక్తి పొలంలో పిడుగుపాటుకు గురై మరణించాడు. ఈ విషాద ఘటన బుధవారం కర్ణాటకలో చోటుచేసుకుంది. స్థానిక మీడియా కథనాల ప్రకారం, మడికేరి టౌన్‌కు చెందిన రోషన్ బాలకృష్ణ ఇటీవలే సాఫ్ట్‌వేర్ జాబ్‌కు రాజీనామా చేసి వ్యవసాయ రంగంలోకి దిగారు. తన స్నేహితుడితో కలిసి పనిచేస్తున్నారు. వ్యవసాయ యంత్రాల మార్కెటింగ్ కూడా చేస్తున్నారు. ఈ క్రమంలో తన కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు నిర్ణయించిన ఆయన మైసూరులోని ఒక పొలాన్ని పరిశీలించేందుకు వెళ్లారు. ఆయన వెంట భార్య, కొడుకు కూడా వెళ్లారు. ఈ క్రమంలో పొలం సమీపంలోని చెట్టు నుంచి మామిడి పండును ఆయన కోసేందుకు ప్రయత్నిస్తుండగా పిడుగు పడింది. దీంతో, కుప్పకూలిన రోషన్ ఘటనా స్థలంలోనే మరణించారు. ఈ ఘటనలో మరో వ్యక్తి కూడా స్వలంగా గాయపడ్డారు. బాధిత కుటుంబానికి జిల్లా విపత్తు నిర్వహణ విభాగం రూ.5 లక్షల పరిహారాన్ని ప్రకటించింది. ఇందులో రూ.4 లక్షలు రాష్ట్ర విపత్తు నిర్వహణ నిధి నుంచి, మిగతా మొత్తం కేంద్ర ప్రభుత్వ నిధి నుంచి బాలకృష్ణ కుటుంబానికి అందజేయనున్నారు.

# కేరళంలో ఇడి అధికారులపై దాడి

## 8మందిని అరెస్ట్ చేసినట్లు రాష్ట్ర డిజిపి వెల్లడి

తిరువనంతపురం:కేరళం మాజీ సీఎం పినరయి విజయన్ నివాసంలో ఈడీ రెయిడ్స్ సందర్భంగా అధికారులపై దాడికి యత్నించిన 8 మందిని అరెస్టు చేశామని రాష్ట్ర పోలీస్ చీఫ్ ఎ. చంద్రశేఖర్ గురువారం తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఇతర నిందితులను ఇప్పటికే గుర్తించామని కూడా తెలిపారు. హోం మంత్రి రమేశ్ చెన్నితాలతో సమావేశం అనంతరం ఆయన ఈ వివరాలు వెల్లడించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని హోం మంత్రి ఆదేశించారని అన్నారు. బుధవారం ఈడీ రెయిడ్స్ గురించి తెలియగానే భారీ స్థాయిలో పోలీసులను పంపించామని కూడా పోలీస్ చీఫ్ తెలిపారు. 'తాము వస్తున్నట్టు ఈడీ అధికారులు ముందుగా మాకు చెప్పలేదు. కానీ ఆపరేషన్ మొదలవగానే మేము భద్రత కోసం సెక్యూరిటీని పంపించాము' అని తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఇప్పటివరకూ కేరళ పోలీసులు దాదాపు 300 మందిపై కేసులు పెట్టారు. అనుమతిలేకుండా గుమిగూడటం, ప్రభుత్వ అధికారులపై దాడి, అక్రమ నిర్బంధం, హత్యాయత్నం తదితర అభియోగాలతో కేసులు నమోదు చేశారు. మ్యూజియమ్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్ ప్రకారం, ఈడీ అధికారులపై నిందితులు కర్రలతో దాడి చేశారు. ఈ క్రమంలో ఒక అధికారి చేయికి గాయమైంది. ఈడీ వాహనం అద్దాలు పగిలిపోయాయి. ఈ దాడిలో కారు డ్రైవర్ కూడా గాయపడ్డారు. పరిస్థితి అదుపు చేసేందుకు ప్రయత్నించిన కేరళ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ పోలీసులను కూడా నిరసనకారులు టా÷-గ్గ÷ట్ చేశారు. నిరసన కారుల వల్ల దాదాపు రూ.3 లక్షల మేర నష్టం జరిగినట్టు తెలుస్తోంది. సీఎంఆర్‌ఎల్ మనీలాండరింగ్ కేసుకు సంబంధించి మాజీ సీఎం పినరయి విజయన్, ఆయన కుటుంబసభ్యుల ఇళ్లల్లో ఈడీ బుధవారం ఈ సోదాలు నిర్వహించిన విషయం తెలిసిందే.

# మధుబని రైల్వే స్టేషన్‌లో ప్రమాదం

## ఖాళీ బోగీలో చెలరేగిన మంటలు

పాట్నా,మే28 : బీహార్ మధుబని రైల్వే స్టేషన్‌లో గురువారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. జయనగర్-ఉద్నా అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ రైలు అగ్నిప్రమాదానికి గురైంది. ఓ ఖాళీ బోగీలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. నిమిషాల వ్యవధిలోనే బోగీ మొత్తం మంటలు వ్యాపించి పూర్తిగా దగ్ధమైంది. ప్లాట్‌ఫామ్ నంబర్-3పై షంటింగ్ పనుల నిమిత్తం రైలు నిలిచి ఉన్న సమయంలో ప్రమాదం జరిగింది. దీంతో అధికారులు, ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. మధుబని రైల్వే స్టేషన్ ప్రాంగణంలో భయాందోళనలు నెలకొన్నాయి. రైల్వే సిబ్బంది వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సుమారు పది అగ్నిమాపక వాహనాలు రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాయి. గంటపాటు శ్రమించి వారు మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంపై సమస్తిపూర్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ జ్యోతి ప్రకాశ్ మిశ్రా స్పందించారు. రైల్వే యంత్రాంగం ప్లాట్‌ఫామ్ ప్రాంతాన్ని ఖాళీ చేయించి విస్తృతంగా భద్రతా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. అగ్నిప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఘటనలో అసాంఘిక శక్తుల ప్రమేయంపైనా ఆరా తీస్తున్నట్లు జ్యోతి ప్రకాశ్ మిశ్రా చెప్పారు. ఇదిలా ఉండగా.. 2022లో అదే ఎ÷-లాట్‌ఫామ్‌పై నిలిచి ఉన్న స్వతంత్ర సేనాని ఎక్స్‌ప్రెస్ ప్రమాదానికి గురై ఐదు కోచ్‌లు దహనమయ్యాయి.

## నాలుగు రాష్ట్రాలకు బిజెపి అధ్యక్షుల నియామకం

న్యూఢిల్లీ,మే28: భారతీయ జనతా పార్టీ అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకుంది. నాలుగు రాష్ట్రాలకు పార్టీ అధ్యక్షులను ప్రకటించింది. ఈ మేరకు గురువారం పంజాబ్, హరియాణా, ఢిల్లీ, త్రిపుర రాష్ట్ర విభాగాలకు కొత్త అధ్యక్షులను నియమిస్తూ వివరాలు వెల్లడించింది. ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడిగా కేంద్ర మంత్రి హర్ష్ మల్హోత్రాను నియమించింది. పంజాబ్ అధ్యక్షుడిగా సీనియర్ నాయకుడు కేవల్ సింగ్ ధిల్లాన్ పేరును ప్రకటించింది. హరియాణా అధ్యక్షురాలిగా అర్చనా గుప్తాను, త్రిపుర బీజేపీ అధ్యక్షుడిగా అభిషేక్

దేబ్‌రాయ్‌ను నియమించింది. తొలిసారి ఎంపీ అయిన హర్ష్ మల్హోత్రాకి ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం కేంద్ర మంత్రి పదవి ఇచ్చింది. ప్రస్తుతం ఆయన కేంద్ర కార్పొరేట్ వ్యవహారాలు, రోడ్డు రవాణా, రహదారుల శాఖ సహాయ మంత్రిగా పని చేస్తున్నారు. తూర్పు ఢిల్లీ నియోజకవర్గానికి హర్ష్ మల్హోత్రా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. దేశ రాజధానిలో బీజేపీని క్షేత్రస్థాయిలో మరింతగా బలోపేతం చేసేందుకు మల్హోత్రాను అధ్యక్షుడిగా ప్రకటించారు.

# బక్రీద్ ప్రార్థనల్లో పాల్గొన్న కోమటిరెడ్డి

నల్గొండ,మే28 :బక్రీద్ సందర్భంగా ముస్లిం సోదరులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. అల్లా పట్ల ఉన్న అపారమైన విశ్వాసాన్ని, త్యాగనిరతిని చాటిచెప్పే గొప్ప పండుగ ఇదని వ్యాఖ్యానించారు. నల్గొండ పట్టణంలోని మునుగోడు రోడ్డు ఈద్గాలో ముస్లిం సోదరులను కలిసి మాట్లాడారు. బక్రీద్ కేవలం ఒక మతపరమైన వేడుక మాత్రమే కాదని... ఇది మానవాళికి ఒక గొప్ప జీవన సందేశమని పేర్కొన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాజకీయాలకు అతీతంగా కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు 'భారత్ జోడో' యాత్ర చేపట్టారని ప్రస్తావించారు. అన్నివర్గాలు, అన్నిమతాల ప్రజలు సమానమేనని, అందరు కలిసి మెలిసి ఉండాలనే గొప్ప సందేశంతో 'భారత్ జోడో' యాత్ర చేశారని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నపుడు ముస్లింలకు 4శాతం రిజర్వేషన్లు కల్పించడంతో విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగాయని తెలిపారు.

# కర్ణాటకలో సీఎం పదవి మూన్నాళ్ల ముచ్చటే

## ఐదేళ్లు నికరంగా పనిచేసిన వారు ముగ్గురే

### ఒడిదుడుకుల రాజకీయంలో ఐదేళ్లు నిలబడని నేతలు



బెంగళూరు: కర్ణాటకలో సీఎం మార్పుపై కొన్ని నెలలుగా సాగుతున్న ప్రచారానికి తెరపడింది. 2023లో ముఖ్యమంత్రి బాధ్యతలు స్వీకరించిన సిద్ధరామయ్య.. ఇప్పుడు ఆ కుర్చీని వదులుకోవడం ఖాయమయ్యింది. తన రాజీనామాను ఆయన గవర్నర్ కార్యదర్శికి అందచేశారు. దీంతో డికె శివకుఆర్‌కు లైన్ క్లీయర్ అయ్యింది. ఎన్నికల ఫలితాల అనంతరం పార్టీ ఇచ్చిన మాట ప్రకారం.. డీకే కొత్త సీఎంగా బాధ్యతలు స్వీకరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆయనే ఖరారయితే ఆయన పదవిలో రెండేళ్లు మాత్రమే ఉంటారు. అసలు కర్ణాటకలో పూర్తి పదవీకాలం సీఎం సీటులో కొనసాగడం ఒక ఘనత అనే చెప్పవచ్చు. 1956 నుంచి కేవలం ముగ్గురు నేతలు మాత్రమే పూర్తికాలం పదవిలో కొనసాగారు. కాంగ్రెస్ నేత ఎస్. నిజలింగప్ప రెండుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేశారు. 1956లో ఏడాదికిపైగా ఆ పదవిలో ఉన్న ఆయన.. 1962లో మరోసారి ఆ బాధ్యతలు స్వీకరించారు. 1968 వరకు అంటే ఐదేళ్ల 345 రోజులు అధికారంలో కొనసాగారు. అదేపార్టీకి చెందిన డి. దేవరాజ్ అర్స్ 1972 నుంచి 1977వరకు, తర్వాత సిద్ధరామయ్య 2013 నుంచి 2018 వరకు పూర్తికాలం ముఖ్యమంత్రులుగా కొనసాగారు. అయితే 1973 వరకు మైసూరు రాష్ట్రంగానే ఉండేది. అనంతరం కర్ణాటకగా పేరు మార్చారు. ఇదిలాఉంటే.. కర్ణాటకలో అతి తక్కువ కాలం పనిచేసిన ముఖ్యమంత్రులూ ఉన్నారు. ఏ పార్టీకి పూర్తి మెజార్టీ రాని సందర్భాల్లో ఎన్నికల అనంతరం పొత్తులు కుదిరినా.. అవి నిలబడలేదు. దాంతో ప్రభుత్వాలు కూలిన సందర్భాలున్నాయి. 2007లో యడియూరప్ప కేవలం వారం రోజులే సీఎం పదవిలో ఉన్నారు. భాజపా-జేడీఎస్ కూటమిలో సయోధ్య లేక ప్రభుత్వం కూలిపోయింది. వీరేంద్రపాటిల్ రాజీనామా చేయడంతో 1971లో కొన్నివారాల పాటు ఎస్ఆర్ కాంతి ముఖ్యమంత్రి బాధ్యతలు నిర్వహించారు. కాంగ్రెస్-జేడీఎస్ నేతృత్వం కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంతో ధరమ్ సింగ్ ముఖ్యమంత్రి అయ్యారు. ఏడాదిపైగా ఆ కుర్చీలో కొనసాగినా.. కూటమిలోని వైరుధ్యాలతో ఆ ప్రయాణం సవ్యంగా సాగలేదు. దాంతో ఆయన 2006లో పదవిని కోల్పోయారు. పార్టీలో అంతర్గత రాజకీయాల కారణంగా భాజపా సదానందగౌడను పక్కనపెట్టడంతో 2012లో జగదీశ్ శెట్టర్ ముఖ్యమంత్రి అయ్యారు. తర్వాత అసెంబ్లీ గడువు ముగిసింది.

# ఉనికి కోసమే బీజేపీ నాయకుల రైతు భరోసా

## ఎఫ్‌సిఐ ద్వారా ఎందుకు కొనరో చెప్పాలి

### బిజెపి నేతలపై మండిపడ్డ మంత్రి అడ్లూరి



జగిత్యాల: ఉనికి కోసమే బీజేపీ నాయకుల రైతు భరోసా యాత్ర చేస్తున్నారని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విమర్శించారు. ఎఫ్‌సీఐ ద్వారా ధాన్యాన్ని ఎందుకు కొనుగోలు చేయడం లేదో బీజేపీ నేతలు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. గురువారం జగిత్యాల జిల్లాలో మంత్రి అడ్లూరి పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. తాలు పేరుతో దోచుకుంటున్నామని బీజేపీ నాయకులు ఆరోపించడం సిగ్గుచేటని అన్నారు. బీజేపీ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే భద్రాద్రి రాముడి ఆలయం ముందు మాట్లాడాలని మంత్రి అడ్లూరి సవాల్ చేశారు. రాష్ట్రంలో బీజేపీ నాయకత్వం సరిగా లేకే ప్రధానమంత్రి నరేంద్రమోదీ.. సీఎం రేవంత్‌రెడ్డితో కలసి పనిచేద్దామని అన్నారని ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులను తీసుకురావడంలో కేంద్ర మంత్రులు విఫలమయ్యారని విమర్శించారు. గోదావరి పుష్కరాలకు కేంద్రం నుంచి బీజేపీ ఎంపీలు నిధులను తీసుకురావాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సవాల్ చేశారు. ఇదిలావుంటే ముస్లింల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. బక్రీద్ సందర్భంగా ధర్మపురిలోని ఈద్గా వద్ద నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ముస్లింల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందన్నారు. నియోజకవర్గంలో మసీదులు, ఈద్గాల అభివృద్ధికి రూ.7 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. అదేవిధంగా ఎస్సీ సంక్షేమ శాఖ ద్వారా నిరుద్యోగ యువతీయువకులు స్వయం ఉపాధి పొందడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ధర్మపురి నియోజకవర్గంలో పదో తరగతి, ఇంటర్ పూర్తయిన యువతీయువకులకు స్వయం ఉపాధి కోసం రూ.2 లక్షల రుణాలు బ్యాంకు ద్వారా ఇప్పించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆసక్తి కలిగిన యువత రుణాల ద్వారా స్వయం ఉపాధి పొందాలని మంత్రి కోరారు. మంత్రి వెంట ధర్మపురి మున్సిపల్ ఛైర్మన్ వేముల నాగలక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సంగనభట్ల దినేష్ తదితరులు ఉన్నారు.

# రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

## చివరి ధాన్యం గింజవరకు కొంటాం

### మంత్రి వివేక్ వెంకటస్వామి వెల్లడి

మంచిర్యాల: తమ ప్రభుత్వం రైతన్నల సంక్షేమానికి ఎంతగానో కృషి చేస్తోందని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. చివరి ధాన్యం గింజ వరకు ధాన్యం కొనుగోళ్లు చేస్తామని పేర్కొన్నారు. గురువారం చెన్నూరు మండలం బావురావుపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి వివేక్ వెంకటస్వామి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈసారి పంట దిగుబడి ఎక్కువగా వచ్చిందని తెలిపారు. జూన్ 6వ తేదీ వరకు ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ కొనసాగుతుందని వివరించారు. పెద్దపల్లిలో మూడు గోడౌన్స్ అలాట్‌మెంట్ చేశామని మంత్రి వివేక్ వెంకటస్వామి చెప్పారు. హమాలీల కొరతతో ధాన్యం కొనుగోలులో కొంత ఆలస్యం జరిగిందని తెలిపారు. సింగరేణి నుంచి 40 లారీలు, మైనింగ్ శాఖ నుంచి 40 లారీలను కేటాయించామని అన్నారు. మొత్తం 80 లారీలతో త్వరలోనే రైతుల నుంచి చివరి గింజ వరకు ధాన్యం కొని మిల్లులకు తరలిస్తామని మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు.



# జడ్చర్ల వద్ద అర్ధరాత్రి రెండు బస్సుల ఢీ

## ప్రమాదంలో ఒకరు మృతి: 14మందికి గాయాలు

మహబూబ్‌నగర్,మే28 : మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్ల సమీపంలో 44వ జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుంచి తిరుపతి వెళ్తున్న ఓ ప్రైవేట్ బస్సును.. బెంగళూరు వైపు వెళ్తున్న మరో ట్రావెల్స్ బస్సు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరో 14 మంది ప్రయాణికులు గాయపడ్డారు. ఈ ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని వెంటనే జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బస్సు డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కావడంతో ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ప్రమాదంలో మృతిచెందిన వ్యక్తిని తిరుపతి రిటైర్డ్ డీఎస్పీ సాంబశివారెడ్డి కుమారుడు అశోక్ రెడ్డిగా గుర్తించారు. అశోక్‌రెడ్డి మృతి వార్తతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఈ ప్రమాదానికి అధిక వేగం, డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమై ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రమాదం కారణంగా కాసేపు జాతీయ రహదారిపై ట్రాఫిక్ అంతరాయం ఏర్పడగా, పోలీసులు వాహనాలను మళ్లించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఇటీవల జాతీయ రహదారులపై వరుసగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు ప్రయాణికుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యంగా అర్ధరాత్రి సమయంలో డ్రైవర్లు అలసట, అధిక వేగంతో వాహనాలు నడపడం వల్ల ఇలాంటి ప్రమాదాలు ఎక్కువవుతున్నాయని అధికారులు చెబుతున్నారు. ప్రయాణ భద్రతపై మరింత అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

# పెట్రో ధరలతో సామాన్యులపై భారం

## రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి లెఫ్ట్ సిద్ధం

### జూన్1 నుంచి 7 వరకు ప్రజాచైతన్య కార్యక్రమం

విజయవాడ,మే28 : క్రమంగా పెరిగిపోతున్న పెట్రోల్, డీజిల్, గ్యాస్, సీఎన్‌జీ ధరలు.. సామాన్యులకు భారంగా మారుతున్నాయి.. దీనితో అన్ని వస్తువులపై వీటి ప్రభావం పడుతోంది.. విజయవాడలో వామపక్ష పార్టీలు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెరుగుదలపై రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమానికి శ్రీకారం చుట్టాయి. సామాన్య ప్రజలపై పెరుగుతున్న ఇంధన భారం తగ్గించాలని డిమాండ్ చేస్తూ పలు దశల్లో ఆందోళనలు నిర్వహించనున్నట్లు ప్రకటించాయి. లెఫ్ట్ పార్టీల ప్రెస్ మీట్‌లో మీడియాతో మాట్లాడిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు.. రోజురోజుకీ పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెరుగుతుం డటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధిస్తున్న అధిక పన్నుల వల్లే ఇంధన ధరలు భారీగా పెరుగుతున్నాయని విమర్శించారు. ఇంధన ధరల పెరుగుదలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జూన్ 1 నుంచి 7వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వామపక్ష నేతలు వెల్లడించారు. అనంతరం జూన్ 9న రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇదే సందర్భంగా పొసర్లపూడిలోని కేజీ బేసిన్ ప్రాంతాన్ని కూడా సందర్శించనున్నట్లు పేర్కొన్నారు. సిఎం చంద్రబాబు నాయుడు రోజూ పెట్టుబడులు, కంపెనీలు, ఉద్యోగాల పేరుతో ప్రకటనలు చేస్తూ హడావిడి చేస్తున్నారని, కానీ ధరల పెరుగుదల వల్ల ఎంత మంది ఉపాధి కోల్పోయారో లెక్కలు చెప్పాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ధరలు తగ్గించకుండా ప్రజల దృష్టి మళ్లించేందుకు పొదుపు చర్యల పేరుతో ప్రభుత్వం ప్రచారం చేస్తోందని ఆరోపించారు. పొదుపు చర్యలను ప్రధాని నరేంద్ర మోడీ, సీఎం చంద్రబాబులే పాటించడం లేదని వ్యాఖ్యానించారు. ఎన్నికల ముందు అధికారంలోకి రాగానే పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తామని నారా లోకేష్ హామీ ఇచ్చారని గుర్తుచేసిన వామపక్ష నేతలు, ఇప్పుడు ఎందుకు ఆ హామీలను అమలు చేయడం లేదని ప్రశ్నించారు.

## ఎడిటోరియల్

భారత రాజకీయాల్లో యువత ప్రవేశించాలి. నేతల అక్రమాలను ప్రశ్నించాలి. అక్రమాలను నిలదీయాలి. అక్రమార్కులను ఎండగట్టాలి. పాచిపోయిన విధానాలను తూర్పురా పట్టాలి. ఈ దేశానికి ఏది అవసరమో దానిని ఎజెండగా ముందుకు తీసుకుని రావాలి. కానీ యువత ఎందుకనో అచేతనంగా ఉంటోంది. ఓటు వేయడానికే బద్ధకిస్తోంది. జెన్ జి అంటూ వార్తలు వస్తున్నా..గట్టిగా నిలబడి రాజకీయ అవినీతిని నిలదీయడం లేదు. రాజకీయ అక్రమాలను నిలదీయడం లేదు. కానీ కాక్రోచ్ జనతా పార్టీ పేరుతో ఆన్‌లైన్ వేదికగా పుట్టుకు వచ్చిన ఓ పార్టీకి కోట్లల్లో లైక్‌లు కొడుతూ..వస్తున్నారు. నిజంగానే ఈ పార్టీ పెట్టిన వారు..దీని లక్ష్యం గురించి ఆలోచిస్తే..అసలు విషయం బయటపడుతుంది. పక్కాగా కాంగ్రెస్, ఆప్ పార్టీల ఎజెండాతో ఇది అవతరించింది. ఇందులో ప్రధాన ఎజెండాలో ఉన్న ఐదు హామీలు కాంగ్రెస్, ఆప్‌లవే అని చెప్పాలి. ఈ రెండు పార్టీల సూత్రధారులుగా అభిజిత్ అన్న వ్యక్తి అమెరికా నుంచి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ద్వారా ప్రకటించిన ఈ పార్టీ కేవలం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత యువతను బొద్దింకలతో, పరాన్నజీవులతో పోల్చడం వల్లే జెన్‌జీ గొంతెత్తిందని ప్రచారం చేస్తున్నారు. అయితే ఇక్కడ జస్టిస్ సూర్యకాంత ఏ సమయంలో ఎవరిని ఉద్దేశించి, ఎందుకు బొద్దింకులు, పరాన్న జీవులు అన్నాడో తెలుసుకోకుండా ఇష్టం వచ్చినట్లుగా బొద్దింకల పార్టీ అంటూ ప్రకటించడం, దానికి గొర్రెల్లాగా మద్దతు తెలపడం దారుణం. ఇది ఓ రకంగా కోర్టు ధిక్కరణ కిందకు వస్తుంది. కొందరు ఫేక్ సర్టిఫికెట్లతో లాయర్లుగా, ఆర్టిఐ కార్యకర్తల్లాగా సమాజం మీద పడి పోతున్నారన్న సందర్భంగా జస్టిస్ట్ సూర్యకాంత బొద్దింకలు పదాన్ని వాడారు. నిజంగానే జెన్‌జీ పోరాటం చేయాల్సిన సామాజిక రుగ్మతలు ఉన్నాయి. పాలకుల దుష్ట పన్నాగాలను దునుమాడాలి. మన విద్యావ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నందుకు గొంతెత్తాలి. మన వైద్యారోగ్య రంగాన్ని ప్రైవేటుకు తాకట్టు పెట్టినందుకు నిలదీయాలి. స్వాతంత్రోద్యమ కాలంలోనూ, ఆ తరవాత కూడా యువత దేశంలో కీలక భూమిక పోషించింది. అసోంలో విదేశీ చొరబాట్లకు వ్యతిరేకంగా అస్సాగణపరిషత్ చేసిన పోరాటం అనన్యసామాన్యం. ఇలాంటివి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. తెలంగాణ తొలిదశ, మలిదశలోనూ యువతే కీలక భూమిక పోషించింది. అయితే ఇవన్నీ పక్కన పెట్టి కేవలం కాంగ్రెస్, ఆప్ గేమ్ ప్లాన్‌లో యువత పడిపోవడం దౌర్భాగ్యం. నిజానికి చట్టసభల్లో అటు పార్లమెంటులోనూ,ఇటు అసెంబ్లీల్లోనూ కొన్ని కుటుంబాలే ఏళ్లుగా పట్టుకుని వేళ్లాడుతున్నాయి. ఆప్ చరిత్ర ఎవరికీ తెలియనిది కాదు. అన్నా హజారే అవినీతి వ్యతిరేక ఉద్యమాన్ని హైజాక్ చేసుకుని వచ్చిన అరవింద్ కేజ్రీవాల్ అవినీతిలో కూరుకుపోయారు. ప్రజల్లో కల్పించిన ఆశలను వమ్ముచేశారు. అన్నా హజరానేనే మోసం చేసి మనముందు ఇప్పుడు నిలబడ్డాడు. ఇకపోతే గబ్బిలాల్లాగా చట్టసభల్లో తరతరాలుగా కొందరే పట్టుకుని వేలాడుతున్నారు. ఒకే కుటుంబం

## కాంగ్రెస్, ఆప్ ఎజెండాతో కాక్రోచ్ పార్టీ

నుంచి కొందరే పార్లమెంట్ లేదా, అసెంబ్లీల్లో ఉంటున్నారు. పార్లమెంటులో సోనియా, రాహుల్, ప్రియాంక ఉన్నారు. ఒకే కుటుంబం నుంచి వీరు ముగ్గురూ ఎందుకు ఉండాలి. అమిత్ షా కొడుకు ఏం అర్హత ఉందని బిసిసి అధ్యక్షుడయ్యారు. ఇలాంటివి ప్రశ్నించాలి. చంద్రబాబు కుటుంబంలో చంద్రబాబు, లోకేశ్, బాలకృష్ణ, శ్రీభరత్, పురందేశ్వరిలు మాత్రమే ఎందుకు ఉండాలి. తెలంగాణలో వెంకటస్వామి ఇద్దరు కొడుకులు వివేక్, వినోద్‌లు ఎమ్మెల్యేలుగా ఉన్నారు. వివేక కొడుకు వంశీ ఎంపిగా ఉన్నారు. వీరంతా ఎస్సీ రిజర్వ్ కేటగిరీలో ఎంపికయ్యారు. మల్లు భట్టివిక్రమార్క బ్రదర్స్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఆయన భార్య పద్మవతిలు కూడా ఒకే ఇంటినుంచి ఎమ్మెల్యేలుగా ఉన్నారు. వీరే నాయకులా..ఇక వేరే వారు లేరా. తెలంగాణ ఉద్యమంలో యువత బలిదానాలు చేస్తే...కెసిఆర్, ఆయన కొడుకు, కూతురు, అల్లుడు, ఇంకా కొందరు బంధువులు తెలంగాణను భ్రష్టు పట్టించి దోచుకున్నారు. ఇలాంటి ఉదాహరణలు కోకొల్లుగా ఉన్నాయి. జెన్‌జీ అని చెప్పకుంటున్న యువత వీటిని నిలదీయాలి. కొందరే ఎల్లకాలం ప్రజాప్రతినిధులుగా ఎందుకు ఉండాలో అడగాలి. ప్రస్తుత డిజిటల్ యుగంలో రాజకీయాలను విశ్లేషించే విధానం పూర్తిగా మారిపోయింది. గతంలో తీవ్రమైన చర్చలు, వీధిపోరాటాల ద్వారా సాగిన రాజకీయ నిరసన నేడు సామాజిక మాధ్యమాల వేదికగా జరుగుతున్నది. మీమ్స్, పొలిటికల్ సెటైర్ల రూపంలో సాగుతున్నది. ఈ క్రమంలో జెన్–జీ యువత సృష్టించిన సరికొత్త వ్యంగ్యాస్త్రమే 'కాక్రోచ్ జనతా పార్టీ'. ఇది నిజమైన రాజకీయ పార్టీ కాకపోయినా ప్రస్తుత రాజకీయ వ్యవస్థలోని లోపాలను, నాయకుల అవకాశవాదాన్ని ఎండగట్టే విధంగా సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నది. అయితే ముందే చెప్పినట్లు దీని ఎజెండా కేవలం కాంగ్రెస్, ఆప్ ఎజెండగా నిలవడమే పెద్ద లోపభూయిష్టంగా ఉంది. అసలు సమస్యలు వదిలి రిటైర్డ్ జడ్జిలని ఎంపిలుగా తీసుకో, ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను నిలదీస్తాం వంటివన్నీ కాంగ్రెస్ ఎజెండా. సుమారు 145 కోట్ల ఈ దేశ జనాభాలో 65శాతానికి పైగా జనాభా 35ఏండ్ల లోపు ఉన్నవారే. అంటే ప్రపంచంలోనే అత్యధిక యువతను కలిగిన దేశమిది. ఈ దేశ భవిష్యత్తును నిర్ణయించాల్సింది వీరే. వీరే ముందుండి నడపాల్సిన అసవరం ఉంది. అపారమైన శక్తి కలిగిన ఈ దేశ యువతను తప్పుదోవ పట్టించేలా అభిజీత్ దీప్కే సామాజిక మాధ్యమాల వేదికగా కాక్రోచ్ జనతా పార్టీ ఏర్పాటుకు ముందుకు రావడం, యువతను ఆకట్టుకోవడం చేశాడు.

ఆకాశంలో స్వాతి నక్షత్రం వెలిగే రోజు, ఆ పావన నక్షత్రపు స్పర్శతో భూమిపై పడే వర్షపు చినుకు అది సాధారణమైన నీటి బిందువు కాదు. ఆ చినుకు సముద్రంలోని శుక్తిలో పడితే ముత్యంగా మారుతుందని మన పూర్వీకులు చెప్పారు. ఆ ఒక్క చినుకులో ఎంత సంభావ్యత దాగి ఉందో అదే విధంగా, ఒక సున్నితమైన హృదయంలో ఎంత విలువైన మానవత్వం నిక్షిప్తమై ఉంటుందో, ఇప్పటి ఆధునిక సమాజం గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



# రాయిలాంటి మనసులు కాదు... ముత్యాల్లాంటి హృదయాలు కావాలి!

సున్నితత్వం బలహీనత అని ముద్ర వేయడం ఈ కాలంలో అతి సులభమైన పని అయిపోయింది. ఒకరు కన్నీళ్ళు పెట్టుకుంటే బలహీనుడు అనీ, మరొకరు ఇతరుల బాధకు మనసు ద్రవించిపోతే అతిగా ఆలోచిస్తున్నావు అనీ, ఇంకెవరైనా సమాజంలోని అన్యాయానికి గళమెత్తితే అతి సెన్సిటివ్ అని కొట్టిపారేయడం మనకు అలవాటైపోయింది. కానీ ఈ ఆధునిక అభిప్రాయం ఎంత తప్పో, ఎంత ప్రమాదకరమో లోతుగా ఆలోచిద్దాం.స్వాతి నక్షత్రం భారతీయ జ్యోతిష్యంలో అత్యంత పవిత్రమైనదిగా పరిగణించబడుతుంది. ఆ నక్షత్రపు ప్రభావంలో పడే వర్షపు చినుకు వేర్వేరు చోట్ల వేర్వేరు రూపాలు తీసుకుంటుందని ఒక పురాతన విశ్వాసం ఉంది. అది శుక్తిలో పడితే ముత్యమవుతుంది, వెదురు కణుపులో పడితే వెదురు పాలవుతుంది, పాము పడగపై పడితే విషమవుతుంది కానీ ఆ చినుకు మాత్రం అన్నిచోట్లా ఒకే విధంగా, నిర్మలంగా, సున్నితంగా పడుతుంది. తన స్వచ్ఛతను మార్చుకోదు.ఈ తత్వమే సున్నితత్వానికి నిలువెత్తు అద్దం పడుతుంది. సున్నితమైన హృదయం ఎక్కడ ఉన్నా అదే మాదిరి స్పందిస్తుంది ఇతరుల సంతోషానికి వెలిగిపోతుంది, ఇతరుల బాధకు కరిగిపోతుంది. పరిసరాల కఠినత్వం ఎలా ఉన్నా తన అంతర్గత నైతికతను కోల్పోదు. ఇది బలహీనత కాదు, ఇది మానవజాతికి దక్కిన ఒక సహజ మానవ సంపద.లోకాన్ని మార్చిన మహనీయులందరూ అసాధారణ సున్నితత్వం కలిగినవారే అనేది చరిత్ర నిరూపించిన సత్యం. మహాత్మా గాంధీజీ ఒక రైలు పెట్టె నుండి నెట్టివేతకు గురైనప్పుడు ఆ అవమానాన్ని వ్యక్తిగతంగా మాత్రమే తీసుకోలేదు. ఒక కోటి మంది నల్లవారు, ఒక వందకోట్ల భారతీయులు అనుభవిస్తున్న అవమానం అది అని ఆయన హృదయం తీవ్రంగా స్పందించింది. ఆ సున్నితత్వమే ఆ తర్వాత కాలంలో సామ్రాజ్యవాదాన్ని గడగడలాడించిన సత్యాగ్రహానికి అసలైన బీజమైంది.స్వాతంత్ర్య సమరంలో తన ప్రాణాలను అర్పించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అడవి తల్లి ఏడుపును, గిరిజన తల్లుల ఆవేదనను తన హృదయంలో అనుభవించాడు. ఆ సున్నితత్వం బలహీనత అయి ఉంటే అతడు రాజమహేంద్రవరంలో పుట్టి, ఏదో ఒక సురక్షితమైన జీవితం గడిపేవాడు. కానీ ఆ మనసు ఇతరుల బాధకు కరిగిపోయే ఆ మహోన్నత మనసు అతణ్ణి అడవులకు నడిపించింది, మన్యం విప్లవ జ్వాలగా చరిత్ర పుటల్లో నిలబెట్టింది.సున్నితత్వం అంటే మరొకరి ఆనందంలో పాలు పంచుకోగలగడం, మరొకరి దుఃఖంలో నిజంగా బాధపడగలగడం, అన్యాయం జరుగుతున్నప్పుడు మనసు తల్లడిల్లడం ఇవన్నీ కలిసిన ఒక గొప్ప మానవ లక్షణం.

ఇది కేవలం తాత్కాలిక భావోద్వేగం మాత్రమే కాదు, ఇది ఒక నైతిక మేల్కొలుపు కూడా. మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని మరింత మెరుగ్గా మార్చాలనే తపనకు ఇదే మూలాధారం.


మన తెలుగు సాహిత్యంలో ఇందుకు అద్భుతమైన ఉదాహరణలు కనిపిస్తాయి. శ్రీకృష్ణదేవరాయలు "అముక్తమాల్యద" రాస్తూ, గోదాదేవి ప్రేమ వేదనను ఎంత లోతుగా అనుభవించాడో తెలుసు? ఆ కవిత్వంలో నిండిన సున్నితత్వం ఆయన్ను కేవలం ఒక సామ్రాజ్య చక్రవర్తిగానే కాకుండా, కాలం దాటి నిలిచిన మహాకవిగా నిలబెట్టింది. పోతన రాసిన భాగవతం "పలికెడిది భాగవతమట, పలికించెడి వాడు రామభద్రుండట" అనే ఆ వాక్యంలో ఎంత వినమ్రత, ఎంత సున్నితత్వం ఉందో చూడండి. అది పోతన బలహీనత కాదు, అది ఆయన ఆత్మ శక్తి.ఈనాటి కార్పొరేట్, పోటీ ప్రపంచంలో కఠినంగా ఉండు, లేకుంటే చిత్తుగా మారతావు అనే నినాదం బాగా ప్రచారమైంది. సెన్సిటివ్ అయిపోకు , ఎక్కువగా ఆలోచించకు,మనసు రాయిలా ఉంచుకో ఇవి మనం మన పిల్లలకు, యువతకు రోజువారీగా నేర్పుతున్న తప్పుడు పాఠాలు. ఇవి నేర్చుకున్న వారు తమ మనసులో ఉన్న సహజ సున్నితత్వాన్ని ఒక పెద్ద లోపంగా భావించి, దాన్ని లోపలే అణచివేసి దాచుకోవడానికి ప్రయత్నిస్తారు. ఇది సమాజానికి ఒక మహా విషాదం.ఒక వైద్యుడు రోగి బాధకు స్పందించకుంటే మంచి వైద్యుడు అవుతాడా? ఒక ఉపాధ్యాయుడు విద్యార్థుల అవగాహన లేమికి మనసు పడకుంటే మంచి గురువు అవుతాడా? ఒక న్యాయమూర్తి పేద నిర్దోషి బాధను హృదయంలో అనుభవించకుంటే నిజమైన న్యాయం ఇవ్వగలడా? ఏ రంగంలో చూసినా మానవీయ సున్నితత్వం లేకుండా నిజమైన శ్రేష్ఠత, నైపుణ్యం సాధ్యపడవు.

సున్నితత్వం మరియు బలం పరస్పర వ్యతిరేకాలు కాదు. వాటి మధ్య వైరుధ్యమే లేదు. నిజానికి, సున్నితత్వం ఉన్నవారే నిజమైన ధైర్యం చూపగలుగుతారు. ఎందుకంటే ఇతరుల బాధను తమ సొంత బాధగా అనుభవించేవారే, ఆ బాధకు వ్యతిరేకంగా, అన్యాయానికి వ్యతిరేకంగా నిలబడటానికి సమాజంలో అందరికంటే ముందుగా ముందుకు వస్తారు.స్వాతి వర్షపు చినుకు చాలా సున్నితంగా పడుతుంది. కానీ ఆ చినుకే కాలక్రమేణా కఠినమైన రాతిని కోసి నీటి సెలయేరుగా తయారవుతుంది. చినుకు చినుకు కలిసి మహా నది అవుతుంది, నదులు కలిసి సముద్రమవుతాయి. సున్నితత్వం అలాంటిదే అది ప్రారంభంలో చాలా చిన్నదిగా, సుకుమారంగా కావచ్చు, కానీ దాని సామాజిక శక్తి అపారమైనది, తిరుగులేనిది.ఒక తల్లి తన పసికందు చిన్న ఏడుపుకు తక్షణం నిద్ర నుండి మేల్కొంటుంది. ఆ తల్లి బలహీనురాలా? ఒక మిత్రుడు తన స్నేహితుని కష్టానికి రాత్రంతా మేల్కొని సహాయపడతాడు. అతడు అసమర్థుడా? ఒక రచయిత్రి సమాజంలో అణగారిన స్త్రీల కష్టాలు చదివి కన్నీళ్ళతో కలం పట్టుకుంటుంది ఆమె బలహీనురాలా? కచ్చితంగా కాదు! వీళ్ళందరూ ఈ కఠిన ప్రపంచాన్ని నిరంతరం మెరుగుపరిచే శక్తులు.ముత్యం ఏ పరిస్థితుల్లో పుడుతుందో తెలుసా? శుక్తిలోకి ఒక ఇసుక రేణువు చొరబడినప్పుడు అది శుక్తికి ఎంతో కష్టమనిపిస్తుంది, అది ఒక నిరంతర వేదన. ఆ వేదనకు స్పందిస్తూ శుక్తి తన అంతరంగ స్రావాలతో ఆ ఇసుక రేణువుని చుట్టుకుంటుంది, పొరపొరలుగా అల్లుతుంది. అలా వేదనను స్వీకరించి, దానిని రూపాంతరం చేసే ఆ అద్భుతమైన ప్రక్రియలోనే ఒక అందమైన ముత్యం పుడుతుంది.అదే విధంగా, సున్నితమైన హృదయాలు జీవితంలోని కష్టాలను, ఇతరుల బాధలను లోపలికి తీసుకొని వాటిని అనుభవించి ఆ అనుభవం నుండి అద్భుతమైన కళను, సాహిత్యాన్ని, సామాజిక మార్పును, న్యాయాన్ని సృష్టిస్తాయి. ఈ ప్రపంచంలో మనం చూసే ప్రతి గొప్ప సాహిత్య రచన, ప్రతి అద్భుతమైన సంగీత స్వరం, ప్రతి విప్లవాత్మక సామాజిక మార్పు ఒక సున్నితమైన హృదయం యొక్క లోతైన బాధ మరియు నిర్మలమైన ప్రేమ నుండే పుట్టాయి.ఇప్పుడు మనందరిపై ఒక ముఖ్యమైన సామాజిక బాధ్యత ఉంది. మన పిల్లలకు మనసు రాయిలా ఉంచుకో అని నేర్పడం వెంటనే మానాలి. బదులుగా నీ మనసు ఇతరుల కొరకు స్పందిస్తుంది అంటే నీలో మానవత్వం సజీవంగా ఉంది అది నీ అసలైన బలం అని గర్వంగా చెప్పాలి. తమ సున్నితత్వాన్ని లోపంగా భావించి దాచుకుంటున్న నేటి యువతకు నీ భావాలు నీ బలహీనత కాదు, అది సమాజంలో నీకున్న ప్రత్యేకత అని ధైర్యం చెప్పాలి.ఒక సున్నితమైన మనిషి ఉన్న ఇల్లు అది నిజమైన స్వర్గం. అక్కడ మాటలకు మనసు ఉంటుంది, నవ్వులకు నిజమైన ప్రేమ ఉంటుంది, కన్నీళ్ళకు తగిన గౌరవం ఉంటుంది. సున్నితత్వం ఉన్న సమాజం అది నిజమైన నాగరిక సమాజం. అక్కడ బలహీనులకు రక్షణ ఉంటుంది, అన్యాయానికి వ్యతిరేకత ఉంటుంది, మానవత్వానికి సింహాసనం ఉంటుంది.స్వాతి ముత్యపు జల్లులు ఈ భూమిపై పడినప్పుడు, అవి తమ సున్నితత్వాన్ని ఎప్పుడూ వదలుకోవు. అదే సున్నితత్వంతో శుక్తిలో చేరి అమూల్యమైన ముత్యంగా మారతాయి. మీరూ అలాంటి వారే మీలోని సున్నితత్వాన్ని బలహీనతగా భావించి ఎప్పుడూ కుంగిపోవద్దు. మీ హృదయం ఇతరుల కొరకు స్పందిస్తే, మీ కళ్ళు కరిగి చెమ్మగిల్లితే, మీ మనసు ఇతరుల బాధకు కరిగిపోతే ఇది మీలో ఉన్న మానవత్వం యొక్క స్వచ్ఛమైన గొంతు అని గ్రహించండి.ఆ అంతర్గత గొంతుని అణచివేయకండి. ఆ సున్నితత్వాన్ని ప్రాణంలా కాపాడుకోండి. ఎందుకంటే ఈ ప్రపంచానికి రాళ్ళలాంటి కఠినమైన మనుషులు అక్కర్లేదు ముత్యాల్లాంటి సున్నితమైన హృదయాలు కావాలి. స్వాతి చినుకులా స్వచ్ఛంగా, నిర్మలంగా, ప్రేమగా ఈ భూమిపై పడి, ఎక్కడ పడినా ముత్యంలా మెరవగలిగే సున్నితమైన మానవ హృదయాలే ఈ సమాజాన్ని అందంగా, నివాసయోగ్యంగా, మానవీయంగా మారుస్తాయి.సున్నితత్వం బలహీనత కాదు అది ఒక గొప్ప మానవ విలువ. అది ప్రకృతి ఇచ్చిన ఒక వరం. అది మీ అసలైన గొప్పతనం.స్వాతి చినుకు వలె నిర్మలంగా, ముత్యమువలె విలువగా మీ సున్నితమైన హృదయం ఈ సృష్టికి సరికొత్త వెలుగు చూపాలి.



డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

# ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి



**రాజన్న సిరిసిల్ల:** ధాన్యం సేకరణ ప్రక్రియలో నిమగ్నమైన అధికారులు అప్రమత్తంగా ఉండి క్షేత్ర స్థాయిలో కొనుగోళ్ళ ప్రక్రియ వేగవంతం అయ్యేలా పర్యవేక్షణ చేయాలని,ధాన్యం తరలింపు,ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీలో జాప్యం లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం,వాహనాల ద్వారా ధాన్యం తరలింపు,హ మాలీల సంఖ్య పెంచి అన్ లోడింగ్ చేయడం,ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ, రైతులకు ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలు, తదితర అంశాలపై శనివారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి ఆర్డీఓలు,పౌర సరఫరాలు,వ్యవసాయ, సహకార శాఖ,గ్రామీణాభివృద్ధి శాఖ, రవాణా,మెప్మా, మార్కెటింగ్,మార్క్ ఫెడ్,కార్మిక శాఖ అధికారులు,అన్ని మండలాల ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, ఏపీఎం లు, ప్యాక్స్ సెక్రటరీలతో జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తూకం వేయడం, తూకం వేసిన ధాన్యాన్ని మిల్లులకు, గోదాములకు తరలించడంపై అధికారులు దృష్టి సారించి, క్షేత్ర స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని, కొనుగోళ్ళ ప్రక్రియ సజావుగా పూర్తయ్యేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు.కొనుగోలు కేంద్రాల నుండి తూకం వేసిన ధాన్యం బస్తాలను తరలించేందుకు సరిపడా వాహనాలు అందుబాటులో ఉండేలా చూడాలని,వాహనాలు సమకూర్చకపోతే సంబంధిత కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో డిమాండ్ కు అనుగుణంగా వాహనాలు సమకూర్చాలని ఆదేశించారు.కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం లోడింగ్ కోసం, మిల్లులు, అపరల్ పార్క్ లో ధాన్యం అన్ లోడింగ్ చేయడం కోసం హమాలీల కొరత లేకుండా చూడాలని, హమాలీల సంఖ్యను డిమాండ్ కు అనుగుణంగా పెంచి, ఇబ్బందులు కలగకుండా పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. హమాలీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు.ముఖ్యంగా రైతులకు ఇబ్బందులు కలగకుండా రైతుల నుండి సేకరించిన ధాన్యానికి సంబంధించిన ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ జాప్యం చేయవద్దని ఆదేశించారు. ఏపీఎం లు ప్రత్యేకంగా దీనిపై దృష్టి సారించి తమ పరిధిలోని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ వేగవంతం చేసేలా పర్యవేక్షణ చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాలు, మిల్లుల వద్ద ఉన్న పరిస్థితులను పర్యవేక్షణ చేయడానికి కేటాయించిన రెవెన్యూ, ఇతర శాఖల సిబ్బంది సమన్వయం చేసుకుని విధులు నిర్వర్తించాలని,క్షేత్ర స్థాయిలో ఏమైనా సమస్యలు తలెత్తితే వెంటనే జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు.